Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 201 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 19 - 3 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం: 2015

## ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం...9 మంది సజీవదహనం



**ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలోని పాలం ప్రాంతంలో బుధవారం పెను విషాదం చోటు చేసుకుంది. ఓ బహుళ అంతస్తుల భవనంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో 9 మంది సజీవదహనం అయ్యారు. మృతుల్లో ముగ్గురు చిన్నపిల్లలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందిన వెంటనే ఢిల్లీ ఫైర్ సర్వీస్ సిబ్బంది, రెస్క్యూ టీమ్ ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. 'నైరుతి ఢిల్లీలోని పాలం (సాద్ నగర్) మెట్రో స్టేషన్ సమీపంలో ఉన్న ఓ బహుళ అంతస్తుల భవనంలో ఉదయం సుమారు 7 గంటల సమయంలో మంటలు చెలరేగినట్లు కాల్ వచ్చింది. వెంటనే స్పందించిన ఫైర్ సిబ్బంది 25 ఫైరింజన్లతో ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాం. మంటల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఇద్దరు వ్యక్తులు భవనంపై నుంచి దూకి గాయపడగా.. వారిని ఆస్పత్రిలో చేర్పించాం. అగ్నిమాపక, సహాయక చర్యల అనంతరం మంటలను ఆర్పివేశాం' అని అన్నారు. ఈ ఘటనపై ఢిల్లీ సీఎం రేఖా గుప్తా 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'పాలంలోని బహుళ అంతస్తుల నివాస భవనంలో జరిగిన దురదృష్టకర అగ్నిప్రమాదం గురించి తెలుసుకుని తీవ్రంగా కలత చెందాను' అని పోస్ట్ చేశారు. అంతే కాకుండా.. ఈ ప్రమాదంపై దర్యాప్తు జరిపేందుకు మేజిస్ట్రేట్ విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. మరోవైపు పాలం మెట్రో సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సంధు ఆందోళన వ్యక్తం చేశారు. సహాకయ, అగ్నిమాపక చర్యలను అధికారులు పర్యవేక్షిస్తున్నారని, బాధితులకు అవసరమైన సహాయ సహకారాల్ని అందిస్తున్నారని ఆయన తెలిపారు.

## 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రారంభించిన సిఎం చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీలో 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. మంగళగిరి బస్టాండ్ నుంచి దివ్యాంగులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్ బస్సులో ప్రయాణించారు. మంగళగిరి నుంచి పెనుమాక వరకు సుమారు 11 కిలోమీటర్ల మేర దివ్యాంగులతో కలిసి నేతల ప్రయాణం కొనసాగింది. దివ్యాంగులతో నేతలు సరదాగా సంభాషించారు. వారి బాగోగులు, వారికి అందుతున్న సంక్షేమ పథకాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు నేతలు. డాన్ బాస్కో స్కూల్, డోలాస్ నగర్, ప్రకాశ్ నగర్, నులకపేట, ఉండవల్లి సెంటర్ మీదుగా పెనుమాక బస్ స్టాండ్‌కు చేరుకున్నారు. పథకం ప్రారంభం సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు, కూటమి పార్టీల కార్యకర్తలు, లబ్ధిదారులు తరలి వచ్చారు. ఉగాది పండుగ సందర్భంగా దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చిన ఈ కానుకతో సుమారు 12.76 లక్షల మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందనున్నారు.

## దివ్యాంగులతో కలిసి భోజనం చేసిన మంత్రి నారా లోకేశ్



**అమరావతి, (రాజధాని వార్తలు):** దివ్యాంగుల గౌరవం పెంచేలా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మంగళగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రారంభించారు. మంగళగిరి బస్ స్టేషన్ నుంచి పెనుమాక వరకు దివ్యాంగులతో కలిసి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్ ప్రయాణించారు. అనంతరం ఉండవల్లి నివాసంలో 'దివ్యాంగ శక్తి పథకం' లబ్ధిదారులతో జరిగిన ఆత్మీయ విందు సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులను ఆత్మీయంగా పలకరించిన మంత్రి లోకేశ్, తన పక్కన కూర్చొన్న శివనాగరాజు, సౌభాగ్య, ఖాశీంబి, అన్నపూర్ణమ్మలతో మమేకమై మాటామంతీ కలిపారు. వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దివ్యాంగుల గౌరవం పెంచాలని, వారిలో పట్టుదల ఎక్కువ అని అన్నారు. అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని తెలిపారు. వారి నుంచి ఎంతో నేర్చుకోవచ్చని అన్నారు. వికలాంగుల ఆత్మగౌరవం ముఖ్యమని లోకేశ్ పేర్కొన్నారు. సమాజంలో కూడా మహిళలను కించపరిచే పదాలను అందరూ విడనాడాలని, ఇందుకోసం తాను పోరాడుతున్నానని అన్నారు.

**ప్రతి ఉగాదికి జాబ్ కేలండర్ విడుదల**

"కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేశాం. ఉగాదికి జాబ్ కేలండర్ విడుదల చేస్తున్నాం. ఇకపై ప్రతి ఉగాదికి జాబ్ కేలండర్ విడుదల చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు రావడం ద్వారా ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి కల్పన జరగుతుంది. అందుకే అనేక కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తున్నాం. మంగళగిరిలో ప్రభుత్వ భూమి లభ్యత చాలా తక్కువగా ఉంది. అందుకే కాజా వద్ద 75 ఎకరాల భూమి కొనుగోలు చేస్తున్నాం. మంగళగిరికి 4,5 ఐటీ కంపెనీలను తీసుకువస్తాం. సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తుంది" అని లోకేశ్ తెలిపారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఎంతో లబ్ధి చేకూరుతోందని లోకేశ్ అన్నారు. స్త్రీలు ఎవరిపై ఆధారపడకూడదని అభిప్రాయపడ్డారు. ఇంటర్ తర్వాత అమెరికా వెళ్లడం తన జీవితంలో అత్యుత్తమ నిర్ణయమని తెలిపారు. అందుకే నా సొంత కాళ్లపై నిలబడగలిగానని, దాదాపు 8 ఏళ్లు నేను అమెరికాలో ఉన్నానని వెల్లడించారు. చదువుతో పాటు ఉద్యోగం చేశానని, దీంతో తనకు ఎంతో అవగాహన వచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల యోగక్షేమాలను, ప్రభుత్వం నుంచి అందుతున్న లబ్ధిని ఈ సందర్భంగా మంత్రి అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ అందుకున్న తర్వాత ఐవీఆర్ఎస్ కాల్స్, సీఎం సందేశం వస్తున్నాయా అని వాకబు చేశారు. తమ పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పించడంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఈ సందర్భంగా మంత్రిని విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రభుత్వంలో అన్నివిధాల అండగా ఉంటామని మంత్రి లోకేశ్ వారికి హామీ ఇచ్చారు. వారితో కలిసి ఫోటోలు దిగారు.

## 'దివ్యాంగ శక్తి' పథకంపై మంత్రి అచ్చెన్నాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు



**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఇటీవల ప్రారంభించిన 'దివ్యాంగ శక్తి' పథకం ద్వారా దివ్యాంగులు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణస్తూ ఎంతో లబ్ధిపొందుతు న్నారన్నారు. చరిత్రలో దివ్యాంగులకు ఎప్పుడు మేలు జరిగినా అది సీఎం చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యమైందని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ..'దివ్యాంగులకు సమాజంలో ప్రత్యేక గౌరవం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం.. ఆగస్టు 15న ప్రారంభించిన 'స్త్రీ శక్తి' పథకం అద్భుత విజయాన్ని అందుకుంది. అదే బాటలో ఇప్పుడు 'దివ్యాంగ శక్తి' సూపర్ హిట్ అవుతుంది. ఇప్పటివరకు దాదాపు 150 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణించారంటే ఈ పథకం ఎంతటి ఘన విజయం సాధించిందో అర్థం చేసుకో వచ్చు. రాష్ట్రంలో మొత్తం 12.70 లక్షల మంది దివ్యాంగులు ఉండగా.. ప్రస్తుతం 2 లక్షల మంది మాత్రమే పాస్‌లు కలిగి ఉన్నారు. శ్రీకాకుళం జిల్లాలో సుమారు 42 వేల మంది దివ్యాంగులు ఉన్నారు. వారందరికీ పాస్‌లు అందేలా చర్యలు తీసుకుంటాం. ఇందుకోసం బస్ స్టేషన్లలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి, వంద శాంతం మందికి పాస్‌లు అందజేసేలా ప్రక్రియను సరళీకరణ చేస్తాం' అని అన్నారు.

## పోలవరం ప్రారంభానికి ముందే నిర్వాసితులకు న్యాయం



**అమరావతి, (రాజధాని వార్తలు):** పోలవరం ప్రాజెక్ట్ ముంపు గ్రామాల నిర్వాసితులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం సమావేశం నిర్వహించారు. పునరావాస పరిహార ప్యాకేజీ మూడో విడతలో భాగంగా నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కును సీఎం అందించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి జీవనాడి అని, నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రయోజనాలు చేకూరతాయని తెలిపారు. గత పాలకులు నిర్వాసితులను పట్టించుకోకుండా, వరదల్లో ప్రజలు మునిగిపోతున్నా నిర్లక్ష్యంగా వదిలేశారని సీఎం విమర్శించారు. ప్రాజెక్ట్ కోసం తమ ఇళ్లు, భూములను త్యాగం చేశారని సీఎం తెలిపారు. గతంలో సంక్రాంతి సందర్భంగా మొదటి విడతగా రూ.800 కోట్లు, దీపావళి సమయంలో రెండో విడతగా రూ.916 కోట్లు చెల్లించినట్లు గుర్తు చేశారు. 21 నెలల్లో 26,149 మంది నిర్వాసితులకు మొత్తం రూ.1,943.53 కోట్లు చెల్లించామని వివరించారు. ప్రాజెక్ట్ రెండు దశలుగా నిర్మాణం జరుగుతోందన్నారు సీఎం. తొలి దశలో 38,068 మంది నిర్వాసితులు ఉన్నారని తెలిపారు. ప్రతి నిర్వాసితుడికి ఇంటి నిర్మాణం కోసం రూ.3.5 లక్షలు ఇస్తున్నామని, ఇంటి స్థలం కోసం రూ.2 లక్షలకు పెంచినట్లు వివరించారు. కేంద్ర ప్రాజెక్ట్ అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనులు చేపడుతోందని తెలిపారు.

**మరో రూ.5 వేల కోట్లు అవసరం**

గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డయాఫ్రం వాల్ దెబ్బతిన్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో రూ.440 కోట్ల వ్యయంతో కట్టిన డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని.. ఇప్పుడు మళ్లీ వెయ్యి కోట్ల రూపాయలతో నిర్మాణం చేపట్టామన్నారు. 6 –7 ఏళ్ల పాటు ప్రాజెక్ట్ ఆలస్యమైపోయిందని.. ప్రాజెక్ట్ ఏమైనా పర్వాలేదనే అహంకార ధోరణితో గత పాలకులు వ్యవహరించారని మండిపడ్డారు. వారం రోజుల్లో డయాఫ్రం వాల్ పూర్తవుతుందని, ప్రాజెక్ట్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. మూడోసారి గోదావరి పుష్కరాల నిర్వహణకు ముందే ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్ట్ పూర్తి అయ్యేందుకు మరో రూ.5 వేల కోట్లు అవసరమని, ఒక వంతెన కూడా నిర్మిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

**పారదర్శకంగా చెల్లింపులు**

నిర్వాసితుల త్యాగానికి ప్రతిఫలం పోలవరం ప్రాజెక్ట్ అని సీఎం పేర్కొన్నారు. నిర్వాసితులకు పారదర్శకంగా చెల్లింపులు జరుపుతున్నామని చెప్పారు. దళారులను నమ్మవద్దని సూచించారు. ప్రాజెక్ట్ ప్రారంభానికంటే ముందే నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. పోలవరం నిర్వాసితుల పట్ల కూటమి ప్రభుత్వానికి కమిట్‌మెంట్ ఉందని.. నిర్వాసిత యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కూడా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ సమావేశానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు, సీఎస్ సాయి ప్రసాద్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## జగన్ హయాంలో వివేకా కేసులో ఏ ఒక్క ఆధారమైనా ఎందుకు బయటపెట్టలేదు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం విశాఖపట్నంలో షర్మిల పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడారు. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి..వివేకా కుమార్తె సునీత మీద చేసిన వ్యాఖ్యలకు తాను చాలా బాధపడ్డానని అన్నారు. వివేకాకు గుండెపోటు వచ్చిందని సునీతానే చెప్పారని.. అవినాశ్‌రెడ్డి మాట్లాడటం చాలా దారుణమని అన్నారు. అవినాశ్ రెడ్డికి పలుకుబడి, డబ్బు ఉందని, ఎన్ని తప్పులు చేసిన తప్పించుకోవచ్చని అనుకుంటున్నారా..? అని ప్రశ్నించారు. సోషల్ మీడియాను చేతితో పెట్టుకొని వ్యక్తిగత హననం చేయాలనుకుంటున్నారని ధ్వజమెత్తారు.

**సాక్షి మీడియాలోనే మొదటగా ప్రచారం**

వివేకానంద గుండెపోటుతో చనిపోయారని సాక్షి మీడియాలోనే మొదటగా ప్రచారం చేశారని షర్మిల ప్రస్తావించారు. స్థానికంగా ఉన్న అవినాశ్‌రెడ్డి, సాక్షి యజమాని భారతిరెడ్డి ఎందుకు గుండెపోటని ప్రచారం చేశారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఈ హత్య ముమ్మాటికీ కడప ఎంపీ టిక్కెట్టు విషయంలోనే జరిగిందని చెప్పుకొచ్చారు. ఈ విషయంపై వివేకానంద స్వయంగా తనతో చర్చించారని తెలిపారు. అవినాశ్‌రెడ్డికి టిక్కెట్టు ఇస్తే, వివేకానంద సపోర్ట్ చేశారని గుర్తు చేశారు. ఎప్పటికైనా వివేకానంద బతికి ఉంటే, తనకు ఇబ్బంది అవుతోందనే కారణంతోనే అవినాశ్‌రెడ్డి ఈ హత్య చేశారని ఆరోపించారు. వివేకా హత్య కేసులో మొదటగా సీబీఐ విచారణ కావాలని జగన్ అన్నారని, ఆ తర్వాత వద్దని కూడా ఆయనే చెప్పారని తెలిపారు. వివేకా కేసును సిట్ అధికారులతో విచారణ చేయిస్తే సరిపోతుందని జగన్ చెప్పారని అన్నారు. ఈ కేసులో సీబీఐ అన్ని ఆధారాలను సేకరించిందని, ప్రధానంగా అవినాశ్‌రెడ్డి పేరును ప్రస్తావించిందని తెలిపారు. జగన్ హయాంలోని ఐదేళ్లలో ఎందుకు ఒక్క ఆధారం కూడా బయటపెట్టలేకపోయారని ప్రశ్నల వర్షం కురిపించారు.

**సునీతకు ప్రాణహాని..**

సునీతారెడ్డి చంద్రబాబు కోసం పనిచేస్తున్నారని చెబుతూ.. అవినాశ్ రెడ్డిని కాపాడుకోవాలని జగన్ ప్రయత్నిస్తున్నారని షర్మిల అన్నారు. సునీతకు ప్రాణహాని ఉందని, అయినా ఆమె పోరాటం చేస్తోందని చెప్పుకొచ్చారు. తన తండ్రి హత్య వెనుక ఉన్న నిజాన్ని బయటకు తీసుకురావాలని సునీత పోరాటం చేస్తోందని అన్నారు.

**కూసింతైనా కనికరం లేదా..?**

'జగన్ అన్నకు కూసింతైనా కనికరం లేదా..? ఇలాంటి అన్న ఉంటే శత్రువులు అనవసరం.. అన్నా అనే పదానికి ఆయన కళంకం. జగన్ మోహన్‌రెడ్డి బాధితులపట్ల కాకుండా నిందితుల పట్ల నిలబడ్డారంటే, వైఎస్ రాజశేఖర్ రెడ్డి జీవించి ఉంటే, ఎంతగానో బాధపడే వారు. వివేకా కేసులో న్యాయం కోసమే చంద్రబాబును సునీత కలిశారు. న్యాయం కోసం, నిరంతరం సునీత పోరాటం చేస్తోందని.. కానీ న్యాయం మాత్రం జరగట్లేదని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు.

# విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఘనంగా 'ప్రపంచ సోషల్ వర్క్ దినోత్సవం'





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో 'ప్రపంచ సోషల్ వర్క్ దినోత్సవం' వేడుకలు మంగళవారం అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.

**సామాజిక మార్పుకు సోషల్ వర్కర్లే కీలకం: వీసీ**

ఈ సందర్భంగా వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ, సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి సోషల్ వర్కర్లు చేసే కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థులు క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా అనుభవాన్ని గడించాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో సోషల్ వర్క్ విద్యార్థులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. "సమాజ సేవ అనేది కేవలం బాధ్యత మాత్రమే కాదు, అది ఒక పవిత్రమైన ధర్మం" అని ఆయన యువతకు పిలుపునిచ్చారు.

**వృత్తి నైపుణ్యంతోనే సామాజికాభివృద్ధి : రిజిస్ట్రార్**


యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ, సోషల్ వర్క్ అనేది మానవతా విలువలను పెంపొందించే ఒక గొప్ప వృత్తి అని అభివర్ణించారు. శాస్త్రీయ విధానాలతో సామాజిక సమస్యలను పరిష్కరించాలని, తద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రభుత్వ మరియు స్వచ్ఛంద సంస్థల్లో సోషల్ వర్క్ పూర్తి చేసిన వారికి విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఆమె వివరించారు.

**సేవా స్ఫూర్తితో ముందుకు సాగాలి**

సోషల్ వర్క్ విభాగ అధిపతి డాక్టర్ ఆర్. మధుమతి మాట్లాడుతూ, ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా సోషల్ వర్కర్ల సేవలను స్మరించుకునే రోజని తెలిపారు. బలహీన వర్గాల సంక్షేమం కోసం విద్యార్థులు అంకితభావంతో పనిచేయాలని కోరారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సి.హెచ్.విజయ మాట్లాడుతూ, విద్యార్థులు నైతిక విలువలు, క్రమశిక్షణతో సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్క్ విభాగ అధ్యాపకులు డాక్టర్ బివి సుబ్బారెడ్డి ఇతర విభాగం డా.జె.విజేత అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని సోషల్ వర్క్ ప్రాముఖ్యతపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. విద్యార్థుల సేవా దృక్పథాన్ని చాటి చెప్పేలా సాగిన ఈ వేడుక ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# ఘనంగా హరివిల్లు ఉగాది పురస్కారాలు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పరాభ నామ ఉగాది నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని హరివిల్లు క్రియేషన్స్ ఆధ్వర్యంలో సోమవారం నాడు నెల్లూరు టౌన్ హాల్ లో జరిగిన హరివిల్లు ఉగాది పురస్కారాల ప్రధాన ఉత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విశిష్ట ఉగాది పురస్కారాన్ని ప్రముఖ సినీ నటుడు బాలాజీకి మరియు డాక్టర్ కె.జయరామిరెడ్డి, జనరల్ ఫిజీషియన్ వారికి అందజేయడం జరిగింది. గౌరవ ఉగాది పురస్కారాలను పచ్చా పెంచలయ్య, బత్తల విజయ్ కుమార్, పి శ్రీనివాసులు నాయుడు, కే.మనోజ్ఞ, పెరికల నరేంద్ర, యామాల కృష్ణయ్య, బెల్లంకొండ ఆంజనేయులు, రాజమహేంద్రవరం సుధాకర్ మరియు బల్లాల రమేష్ తదితరులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టిడిపి నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, శ్రేయ రియల్ ఎస్టేట్ అధినేత డాక్టర్ కె ఆగస్టస్ బాబు, డాక్టర్ నిశ్చల్ ప్రసాద్ రెడ్డి, డాక్టర్ సి.యస్.శ్రీనివాసరాజు, పేరూరి ప్రదీప్, వేలూరు రంగారావు, అందె శ్రీనివాసులు, పాబోలు రామసుబ్బారావు, బండి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. హరివిల్లు క్రియేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు దోర్నాల హరిబాబు, ఐ. శ్రీనివాసరావు, కామేశ్వరరావు, వి అక్షయకాంత్ బాబు తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాల భాగంగా సురభి గాయత్రి, దేగల సాంబశివరావుగారు శిరీష లతల శిష్య బృందం చేసిన శాస్త్రీయ జానపద నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా డాక్టర్ కే.జయరామిరెడ్డి మాట్లాడుతూ అంతరించిపోతున్న సాంస్కృతిక కళారూపాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని మానస ఉల్లాసానికి కళలు దోహదపడతాయని పేర్కొన్నారు. సినీ నటుడు బాలాజీ మాట్లాడుతూ..మనిషి ప్రస్తుతం మానసిక ఒత్తిడితో జీవిస్తున్నాడని, ఆ ఒత్తిడిని తట్టుకోవాలంటే నవ్వు ఒక్కటే ఆయుధమని, ప్రతిరోజు కాసేపు నవ్వుకోవాలని కోరారు. మన సంస్కృతిని సాంప్రదాయాన్ని పిల్లలకు నేర్పించాలని ఈ సందర్భంగా తల్లిదండ్రులకు సూచించారు.



# దివ్యాంగశక్తి పథకంతో దివ్యాంగులకు ఆత్మగౌరవం

**- సాయంతో పాటు ఖర్చులూ తగ్గిస్తున్నాం - దివ్యాంగులకు ఎల్లప్పుడూ సంక్షేమాన్ని ఇచ్చేది మేమే - దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు - మంగళగిరి నుంచి పెనుమాక వరకూ వారితో కలిసి ప్రయాణించిన సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ - తన నివాసంలో దివ్యాంగులకు సీఎం ఆత్మీయ విందు - దివ్యాంగుల ముసుగులో లబ్ది పొందుతున్న వారిని ఏరి వేయాలని సీఎంకు వినతి**






**అమరావతి, (రాజధాని వార్తలు):** దివ్యాంగుల శక్తిని ప్రపంచానికి చాటేలా ఆత్మ స్థైర్యంతో పని చేసేలా తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దివ్యాంగులు సాధికారత సాధించడానికి.. వారి గౌరవాన్ని మరింత పెంచడానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని సీఎం స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని దివ్యాంగులకు అందుబాటులోకి తెస్తూ దివ్యాంగ శక్తి పథకాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌తో కలిసి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఏపీఎస్ ఆర్టీసీలోని సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్, పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. మొత్తంగా 21 కేటగిరీల బస్సుల్లో 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తూ పథకాన్ని అమల్లోకి తెచ్చారు. దివ్యాంగుల వెంట వచ్చే సహాయకులతో కలిపి మొత్తంగా 12.76 లక్షల మంది లబ్దిదారులకు ప్రయోజనం కల్పించేలా ఉచిత బస్సు ప్రయాణం పథకం అమల్లోకి వచ్చింది. ఈ పథకం కోసం ఏటా రూ.207 కోట్ల రూపాయల ప్రజా ప్రభుత్వం ఖర్చు పెట్టనుంది. దివ్యాంగుల శక్తి పథకానికి సంబంధించిన ఈ నిధులను ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించనుంది. పథకం ప్రారంభించిన సందర్భంగా మంగళగిరి బస్టాండ్ నుంచి రాజధానిలోని పెనుమాక వరకు దివ్యాంగులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ బస్సులో ప్రయాణించారు. సుమారు 11 కిలో మీటర్ల మేర దివ్యాంగులతో ప్రయాణించిన నేతలు.. వారి కష్ట సుఖాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న పథకాలను.. కార్యక్రమాలను వివరించారు. ఈ పథకం ప్రారంభిస్తున్న సందర్భంగా ప్రజలు, కూటమి పార్టీల కార్యకర్తలు, లబ్దిదారులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలకు అభివాదం చేసుకుంటూ సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి నారా లోకేష్ ముందుకు సాగారు. దివ్యాంగులతో కలిసి ప్రయాణం చేసిన అనంతరం తన నివాసంలో దివ్యాంగ శక్తి పథకంలోని పలువురు లబ్దిదారులకు సీఎం ఆత్మీయ విందు ఇచ్చారు. విందుకు వచ్చిన వారిని ముఖ్యమంత్రి అప్యాయంగా పలకరించారు. వారితో కలిసి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ భోజనం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించటంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు దివ్యాంగులు ధన్యవాదాలు తెలిపారు. తమ వెంట వచ్చే సహాయకులకు ప్రయాణంలో 50 శాతం రాయితీ కల్పించటంపై హర్షం వ్యక్తం చేశారు.

**దివ్యాంగుల్లో ఆత్మ విశ్వాసం నింపుతాం**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."దివ్యాంగ శక్తి పథకంతో ఈ ఉగాది మరింత వేడుకగా జరుపుకోండి. అందరికీ ఉగాది శుభాకాంక్షలు. 21 నెలల్లో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. దివ్యాంగ శక్తి పథకం ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని కలిగిస్తోంది. నేను, పవన్ కళ్యాణ్, లోకేష్ కలిసి ఈ పథకాన్ని ప్రారంభించి దివ్యాంగులతో కలిసి ప్రయాణించటం సంతృప్తిని ఇచ్చింది. దివ్యాంగులంటే విభిన్న ప్రతిభావంతులు, సమస్యను అధిగమించి విజయాలు సాధించే శక్తి ఉన్న వాళ్లు. గతంలో చేయూత కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు సహాయం చేశాం. దివ్యాంగులకు పింఛను కింద రూ.6 వేలు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదే. రూ.500 ఉండే దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచి ఇస్తున్నాం. తీవ్ర ఆరోగ్య ఇబ్బందుల్లో ఉండే వారికి రూ.10 వేలు, మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు ఇస్తున్నాం. ఏటా పింఛన్ల కోసం రూ.33 వేలు ఖర్చు చేస్తున్నాం. ఇప్పుడు బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. ఎలాంటి ఖర్చు లేకుండా దివ్యాంగులు ఇక ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. పనులకు, అవసరాలకు ఖర్చు లేకుండా ప్రయాణం చేయవచ్చు. నెలకు రూ.2 వేల దాకా ఆదా అయ్యే అవకాశం ఉంది. మొదటి నుంచి మేమే దివ్యాంగుల సంక్షేమానికి పని చేస్తున్నాం. భవిష్యత్తులోనూ దివ్యాంగులను ఆదుకునేలా మరిన్ని ఆలోచనలు చేస్తాం. ఎంత ఖర్చు చేస్తున్నామో చూడడం లేదు... దివ్యాంగులకు గౌరవాన్ని ఏ మేరకు పెంచుతున్నామనే అంశం పైనే దృష్టి సారించాం. కూటమి అమలు చేసే ఏ పథకం, ఏ కార్యక్రమమైనా నిరుపేదల సంక్షేమం కోసమే. దివ్యాంగులకు అండగా నిలబడాలనే ప్రజా ప్రభుత్వం పని చేస్తోంది. మహిళల కోసం తెచ్చిన స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటి వరకూ 52 కోట్ల ప్రయాణాలు జరిగాయి. దివ్యాంగ శక్తితో లక్షల మందికి మేలు జరుగుతుంది. దివ్యాంగ సమస్యలపై ఎప్పుడూ పోరాటాలు చేసే మంద కృష్ణమాదిగ, గోనుగుంట్ల కోటేశ్వరావులను అభినందిస్తున్నాను." అని సీఎం అన్నారు.

**పేదల కోసం పని చేసే ప్రజా ప్రభుత్వమిది**

"దివ్యాంగులకు ఇంకా మేలు చేకూరుస్తాం... దానికి కొంచం సమయం పడుతుంది. తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత దివ్యాంగుల సంక్షేమం కోసం కార్పొరేషన్‌ను ఎన్టీఆర్ ఏర్పాటు చేశారు. రూ.500గా ఉన్న పింఛను 2014లో టీడీపీ వచ్చాక రూ.1500 చేశాం. 2018-19 మధ్య రూ.3000కు పెంచాం. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం దివ్యాంగులకు ఒక్క రూపాయి కూడా పెంచలేదు. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ ఆ పెన్షన్ను రూ.6000 చేశాం. దివ్యాంగులను ఆదుకునే అవకాశాన్ని భగవంతుడు అందించారు. 2024 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పని చేశాం. రాష్ట్ర పునర్నిర్మాణం జరగాలి.. పేదలను ఆదుకోవాలని ఆ ఎన్నికల్లో కలిశాం. 94 శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమి అభ్యర్థులు గెలిచారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రాకుండా ఉంటే దివ్యాంగుల పింఛన్లు పెరిగేవి కాదు. దివ్యాంగ శక్తి పథకం వచ్చేది కాదు. స్కూటర్లు ఇచ్చినా ట్రై సైకిళ్లు అందించినా దివ్యాంగులను మిగతా వారికంటే ఎక్కువ ఆదరించాలి. దివ్యాంగులకు ల్యాప్ టాప్‌లు అందించాం. వారికి మరింత మంచి చేస్తాం... మంచి చేసిన వారిని గుర్తుంచుకోవాలి. జరిగిన మంచిని 10 పది మందికి చెప్పాలి. సుస్థిర ప్రభుత్వం ఉంటే అభివృద్ధి పెద్ద ఎత్తున జరుగుతుంది. ప్రతినెలా పేదల సేవలో కార్యక్రమం ద్వారా తెల్లవారు ఝామునే పింఛను ఇస్తున్నాం. అప్పులు చేసినా, కేంద్రం నుంచి నిధులు తెచ్చినా పేదల సంక్షేమం కోసమే. పట్టుదలకు దివ్యాంగులు మారుపేరు. కఠోర శ్రమతో సాధించే వరకు నిద్రపోరు. దివ్యాంగులకు క్రీడలు కూడా నిర్వహించాం...రాష్ట్రంలో ముందుకు వచ్చిన దివ్యాంగులకు శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు వెళ్లేలా చేస్తాం. గత ప్రభుత్వం చాలా తప్పులు చేసింది. దివ్యాంగుల పేరుతో బాగున్న వారు కూడా పింఛన్లు, ఉద్యోగాలు పొందారు. ఇది చాలా నీచం బాధాకరం." అని ముఖ్యమంత్రి చెప్పారు.

**కూటమి కలకాలం ఉండాలి : దివ్యాంగులు**

సీఎం చంద్రబాబు ఇచ్చిన ఆత్మీయ విందుకు హాజరైన పలువురు దివ్యాంగులు తమ అభిప్రాయాలను... తమ భావాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో పంచుకున్నారు. కూటమి ప్రభుత్వం 15 ఏళ్లు ఇలాగే కలిసి ఉండాలని... ప్రభుత్వం కొనసాగాలని కోరుకున్నారు. మంచి ప్రభుత్వం కొనసాగితే... తమకు సంక్షేమ పథకాలు ఇలాగే అందుతూ ఉంటాయని చెప్పారు. దివ్యాంగులుగా పుట్టినందుకు బాధగా ఉన్నా...ప్రభుత్వం తమను చూసుకుంటున్న విధానంతో సంతోషంగా ఉందన్నారు. తమను క్రీడల్లో కూడా ప్రోత్సహిస్తున్నారని...గత ప్రభుత్వాలు తమను పట్టించుకోలేదని పలువురు దివ్యాంగులు అభిప్రాయపడ్డారు. దివ్యాంగుల ముసుగులో కొందరు పింఛన్లు పొందుతున్నారని... పింఛన్ల వెరిఫికేషన్ చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. అన్ని అవయవాలు సవ్యంగా ఉన్నారు కూడా దివ్యాంగులమని తప్పుడు సర్టిఫికెట్లు తెచ్చుకుని ప్రభుత్వ కోటాలో ఉద్యోగాలు పొందుతున్నారని...అలాంటి వారిని గుర్తించేలా వెరిఫికేషన్ చేయాలని సీఎంకు కొందరు దివ్యాంగులు విజ్ఞప్తి చేశారు.

# ఏపీలో వన్ డిస్ట్రిక్ట్ – వన్ ప్రొడక్ట్ కింద 99 రకాల ఉత్పత్తులు గుర్తింపు

## - లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు కేంద్రమంత్రి సమాధానం




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా నెల్లూరు జిల్లాలో గుర్తించి, ప్రోత్సహించిన 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' వస్తువుల వివరాలు, ఈ స్కీమ్ కింద ఖర్చు చేసిన నిధుల వివరాలు తెలియజేయాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు లోక్ సభలో మంగళవారం ఆయన పలు అంశాలపై ఆరా తీశారు. గత అయిదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో రాణుస్రా ఉత్పత్తుల అమ్మకం ద్వారా ఆర్జించిన మొత్తం ఆదాయం, కల్పించిన ఉపాధిపై ప్రశ్నించారు. ఇందులో నిమగ్నమైన పారిశ్రామికవేత్తలకు, ముఖ్యంగా మహిళా పారిశ్రామికవేత్తలకు, అందించిన మద్దతు, గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా, నెల్లూరు జిల్లాలలో ఓడిఓపి సంబంధిత వ్యాపారాభివృద్ధి అమలు కోసం వినియోగించిన మొత్తం నిధులపై వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద సమాధానం ఇచ్చారు. 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' అనేది అన్ని ప్రాంతాలలో సంపూర్ణ వృద్ధిని సాధించేందుకు, దేశంలోని ప్రతి జిల్లా నుండి కనీసం ఒక ఉత్పత్తిని ఎంపిక చేసి, దానికి బ్రాండింగ్ చేసి, ప్రోత్సహించే లక్ష్యంతో పరిశ్రమల ప్రోత్సాహక మరియు అంతర్గత వాణిజ్య శాఖ చేపట్టిన ఒక కార్యక్రమమన్నారు. ఓడిఓపి ఉత్పత్తుల ఎంపికను ఆయా రాష్ట్ర/కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వాలు చేపడతాయనీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 26 జిల్లాల నుండి 99 ఉత్పత్తులను గుర్తించిందన్నారు. అందులో నెల్లూరు జిల్లా నుంచి ఉదయగిరి చెక్క నగిషీ వస్తువులు, పాటూరు కాటన్ సిల్క్ సారీస్ ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచారం మేరకు నెల్లూరులో పాటూరు చీరల ద్వారా గత ఐదేళ్లలో మొత్తం 52.50 కోట్ల వ్యాపారం జరగగా.. 2850 మందికి ఉపాధి లభించిందని చెప్పారు. ఈ పథకం కింద 42.50 కోట్ల వాణిజ్యం జరిగిందన్నారు. చేనేత, వస్త్ర ఉత్పత్తుల కోసం, రాష్ట్ర ప్రభుత్వం వివిధ ఎగ్జిబిషన్లు, ఇ-కామర్స్ & డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, ఎక్స్పోర్ట్, సోషల్ మీడియా & బొటిక్ భాగస్వామ్యాల ద్వారా, ముఖ్యంగా ఉప్పాడ జామ్దాని, వెంకటగిరి కాటన్ చీరలు, పొందూరు ధోతీ & షర్టింగ్స్, మదనపల్లె సిల్క్ చీరలపై ప్రత్యేక దృష్టి సారించి, రాణుస్రా ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలను అందిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమం కింద సుమారు 30% మహిళా పారిశ్రామికవేత్తలకు రూ.35.52 కోట్ల మొత్తం కేటాయించబడిందన్నారు. గత ఐదేళ్లలో ఓడిఓపి కింద రాష్ట్రవ్యాప్తంగా 15841 మంది లబ్ధిదారులకు 118.40 కోట్ల ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. ఇక నెల్లూరు జిల్లాలో 762 మందికి 6.25 కోట్ల లబ్ధి కలిగిందని చెప్పారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఓడిఓపి ఉత్పత్తులకు సంబంధించి ఎటువంటి నిధులు కేటాయించలేదని, అయినప్పటికీ, వ్యాపార ప్రదర్శనలను ప్రోత్సహించడానికి, విస్తరించడానికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చేనేత మరియు వస్త్ర పరిశ్రమల శాఖ ద్వారా అన్ని ఓడిఓపి చేనేత ఉత్పత్తులకు ప్రత్యేక స్టాల్ కేటాయింపులు చేస్తోందని పేర్కొన్నారు.


# అత్యంత వైభవంగా పోలేరమ్మ పొంగళ్ల మహోత్సవం

## – హాజరైన యాదవ సంఘం నాయకులు









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా, కోవూరు నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రమైన కొడవలూరులో మంగళవారం గ్రామ దేవత, శ్రీ జగన్మాత పోలేరమ్మ తల్లి పొంగళ్ల కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ ప్రజల ఆధ్వర్యంలో సాంప్రదాయ పద్ధతుల్లో, భక్తిశ్రద్ధలతో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పెరుమాళ్ళ పద్మజా యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు జిల్లా అధ్యక్షులు విటపు లలితారామ్ యాదవ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఓడలా శైలజా యాదవ్, జిల్లా మహిళా ఇంచార్జ్ రువూరు అరుణా యాదవ్ విచ్చేశారు. అలాగే ముఖ్య అతిథులుగా కొడవలూరు మండల మాజీ మహిళా అధ్యక్షురాలు కామాక్షి యాదవ్, విడవలూరు పిహెచ్‌సి డాక్టర్ నిమ్మకాయల కరుణాకర్ యాదవ్ దంపతులు, నెల్లూరు మోక్షానందన డెంటల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఓడలా శేఖర్ యాదవ్, డాక్టర్ సుజాతా యాదవ్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం ఉత్సవ నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించారు. ఈ ఉత్సవాల నిర్వహణలో పిట్టా మల్లి, అఖి, అంబటి విజయ్ కుమార్, బల్లా శ్రీనివాసులు, చిట్టిబోయిన వెంకటేశ్వర్లు యాదవ్ తదితరులు పలువురు గ్రామ పెద్దలు, విశేష సంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణ పిలుపు మేరకు 47వ డివిజన్ సచివాలయంలో ప్రజా దర్బార్









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని 47వ డివిజన్ సచివాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు తమకు ఎదురవుతున్న వివిధ సమస్యలను వినతుల రూపంలో సమర్పించగా, అడిషనల్ కమిషనర్ వాసు బాబు మరియు 47వ డివిజన్ కార్పొరేటర్ పోట్లూరి రామకృష్ణ వాటిని పరిశీలించి, తక్షణ పరిష్కారం కోసం అవసరమైన చర్యలు చేపట్టారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ చెంగయ్య, యూనిట్ ఇంచార్జ్ రెహమాన్, దండపాణి సురేష్, అల్లంపాటి వెంకటరమణ, ఐటిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ మహంకాళి సురేంద్ర, జనరల్ సెక్రటరీ విజయ్, తెలుగు యూత్ ప్రెసిడెంట్ పెరంబాకు కిరణ్, మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ ఉమ్మెనహి బేగం, ట్రెజరర్ బి.చంద్ర, బిఎల్‌సి ఆర్కాట్ శీను, పిల్ల ప్రసాద్, జహూర్ అహ్మద్, రామిశెట్టి గిరిబాబు, ఎ. చంద్ర, సలీం, మెడ శ్రీను, శ్రీకాంత్, శ్రీహరి, రమేష్, మహేష్ కోఆర్డినేటర్ మౌనిక, అంజాద్ తదితరులు మరియు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# "తిరుపతిలో మహిళలపై దాడికి నిరసనగా నెల్లూరులో మెరుపు ధర్నా"










**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలో టీటీడి చైర్మన్ బిఆర్ నాయుడు రాసలీలల విషయంలో రాజీనామా చేయాలంటూ తిరుపతిలో శాంతియుతంగా నిరసన తెలియజేసిన మహిళలపై దాడి చేయడంతో పాటు అక్రమ కేసులు బనాయించడంతో నెల్లూరు నగరంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మహనీయుడు బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించి, అంబేద్కర్ కూడలి వద్ద వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు కార్యకర్తలతో కలిసి భారీ ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న శాసనమండలి సభ్యులు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఇన్చార్జి ఆనం విజయకుమార్ రెడ్డి మహిళా నేతలు, స్థానిక నాయకులు, తదితరులు రాసలీల బిఆర్ నాయుడు తిరుమల ప్రతిష్టకు భంగం కలిగించారంటూ మండిపడడంతో పాటు వెంటనే రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. బి ఆర్ నాయుడులాంటి అనైతిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తిని పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానానికి చైర్మన్‌గా నియమించడం రాసలీలలు బయటపడిన తర్వాత కూడా కొనసాగించడం చూస్తుంటే చంద్రబాబుకు ఏడుకొండలవాడంటే భయము, భక్తి, రెండు లేవని అర్థమవుతుంది. బి ఆర్ నాయుడు గద్దె దిగే వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేసిన నేతలు ఒక్క పిలుపుతో ధర్నా కార్యక్రమానికి వెంటనే స్పందించి భారీగా తరలి వచ్చిన మహిళలకు, స్థానిక నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేసిన జిల్లా అధ్యక్షులు కాకాణి.

# అధికారులు అభివృద్ధిపై దృష్టి పెట్టాలి : చైర్ పర్సన్

## - కౌన్సిల్ సభ్యులకు ఘన సన్మానం



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** అధికారులు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని మున్సిపల్ ఛైర్పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు సూచించారు. మంగళవారం పెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం కమీషనర్ కె. శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వైస్చర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు త్రాగునీరు, వీధిలైట్లు, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని, తెలిపారు. అనంతరం కౌన్సిల్ అజెండాలోని పలు అంశాలు, అభివృద్ధిపై చర్చించడం జరిగింది. అనంతరం కౌన్సిల్ పదవీకాలం ముగియడంతో కౌన్సిల్ సభ్యులను మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెండవ వైస్చర్పర్సన్ కనకాల మహాలక్ష్మీ. మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, మున్సివల్ డిఇ కె.రాజారావు, ఆర్వో అచ్యుతరాజు, మున్సిపల్ టిసిఓ చింతా ఫణికుమార్, ఏజలు ఉమామహేశ్వరి, పి.వి. సుధాకర్, స్వర్ణ జిఎస్ఋఎన్ మేనేజర్ ప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ ఆదినారాయణ, ఆర్క గంగాధర్, కౌన్సిలర్ గుమస్తా అత్తిలి వీర్రాజు, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

# గృహ అవసర గ్యాస్ సరఫరాపై ఎటువంటి ఆందోళన అవసరం లేదు : జిల్లా పౌరసరఫరాల అధికారి జి.మురళీనాథ్

**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల సరఫరా విషయంలో ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా పౌర సరఫరాల అధికారి జి. మురళీనాథ్ తెలిపారు. జిల్లాలో ప్రస్తుతానికి సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని, సరఫరా నిరంతరంగా కొనసాగుతున్నదని ఆయన వివరించారు. ఏజెన్సీల ద్వారా గ్యాస్ సిలిండర్ల సరఫరా సజావుగా జరుగుతున్నదని, ఎక్కడైనా ఆలస్యం లేదా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత అధికారులకు సమాచారం అందించవచ్చని తెలిపారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వినియోగదారులు అవసరమైనప్పుడు కంట్రోల్ రూమ్‌ను సంప్రదించి తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచించారు. ప్రజలు అవసరానికి మించి గ్యాస్ సిలిండర్లను నిల్వ చేసుకోవడం, అనవసరంగా కొనుగోలు చేయడం చేయకూడదని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహిస్తున్నందున అందరికీ సమయానికి గ్యాస్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# సంపాదకీయం

## మోదీ జైత్రయాత్రకు తిరుగులేదా?

నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఎన్నికలు ప్రకటించారు. ఇప్పుడు అందరి ఆసక్తి ఎన్నికల రాష్ట్రాలలో ఘటనా ఘటనలపై ఉన్నది. పార్లమెంటులో గత రెండు రోజులుగా సభా కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయి. గత సమావేశాల్లో సస్పెండ్ అయిన 8 మంది ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేతకు ప్రభుత్వం, స్పీకర్ అంగీకరించడం ఉభయ పక్షాల మధ్య ఒక అవగాహన ఏర్పడిందనడానికి సూచిక. అయినా పార్లమెంటులో ఎంత హంగామా సృష్టించినా, లేక ప్రభుత్వం ఎంత మొండి వైఖరితో వ్యవహరించినా పాలక, ప్రతిపక్షాలు తమ బలాబలాలు ప్రజల కోర్టులో తేల్చుకోవాల్సిందే కదా! ప్రభుత్వంపై ప్రజాగ్రహం వెల్లువెత్తనంతవరకు, అది ఎన్నికల ఫలితాల్లో వ్యక్తం కానంతవరకూ పార్లమెంటును స్తంభింపచేయడం వల్ల ప్రయోజనముండదు. తనకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై పార్లమెంటు రెండు రోజుల పాటు చర్చించి తిరస్కరించిన తర్వాత స్పీకర్ ఓం బిర్లా తన సీటులో మళ్లీ కూర్చుని 'ఈ రెండు రోజులూ సభా సమయం వృథా అయింది..' అని వ్యాఖ్యానించారు. తాము ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ప్రతిపక్షాలు ఓటింగ్‌కు కూడా సిద్ధపడకపోవడం ఆశ్చర్యకరం. ఓం బిర్లాను సభలో ఉన్న 233 మంది ప్రతిపక్ష సభ్యులు వ్యతిరేకిస్తున్నారనే సందేశం వెళితే ఎంత బాగుండేది? బహుశా ప్రతిపక్షాలు సంఘటితంగా లేవనే అభిప్రాయం ప్రజల్లోకి వెళుతుందని విపక్షాల వారు భావించారేమో?! అవిశ్వాస తీర్మానంపై సమాజ్‌వాది పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు సంతకం పెట్టకపోవడం గమనార్హం. అయినా ప్రతిపక్ష ధర్మాన్ని పాటించి వారూ అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా మాట్లాడారు. ఓం బిర్లాపై పెట్టిన అవిశ్వాసంపై చర్చ జరగాల్సి ఉండగా పశ్చిమాసియాపై చర్చించాలని పట్టుబట్టి సభను స్తంభింపచేయడం కూడా కాంగ్రెస్ తమ తీర్మానం విషయంలో సీరియస్‌గా లేదని, అందుకు కారణాలున్నాయని అర్థమవుతోంది. అయినా వారి వ్యతిరేకత మోదీపైనే కానీ బిర్లాపై కాదు కదా! నిజానికి పార్లమెంటును వేదికగా ఉపయోగించుకుని ప్రతిపక్షాలు తాము చెప్పదలుచుకున్న విషయాన్ని అద్భుతంగా వివరించి ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు అవకాశాలున్నాయి. గతంలో హీరేన్ ముఖర్జీ, ఇంద్రజిత్ గుప్తా, పీలూమోడీ, అటల్ బిహారీ వాజపేయి, జార్జి ఫెర్నాండెజ్, సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ, వెంకయ్యనాయుడు తదితరులు ప్రతిపక్షంలో ఉండగా చేసిన అద్భుత ప్రసంగాలే వారిని జాతీయ స్థాయి నాయకులుగా నిలిపాయి. వారితో పోలిస్తే రాహుల్‌గాంధీ ఇంకా పార్లమెంట్‌లో గొప్ప వక్తగా రాణించలేదనే చెప్పాలి. కాంగ్రెస్‌లో మంచి వక్తలు లేరని చెప్పలేము కానీ రాహుల్‌గాంధీ సభా ప్రతిపక్ష నాయకుడు అయినందున రాజకీయాలన్నీ ఆయన చుట్టూనే తిరుగుతాయి. సభలో మాట్లాడి లేచి నిలబడిన రెండు క్షణాలకే నర్వాణే అనో, ఎప్‌స్టీన్ అనో మొదలు పెట్టి కల్లోలం సృష్టించడం తన శైలిగా ఆయన నిరూపించుకుంటున్నారు. అదే అంశాన్ని ఒక ఉధృత ప్రసంగ ప్రవాహంలో భాగంగా చెప్పి సభ్యుల దృష్టినే కాదు, దేశాన్ని మెప్పించగల అవకాశాన్ని ఆయన కోల్పోతున్నారేమో అనిపిస్తోంది. అదే ప్రియాంకాగాంధీ వాద్రా ఇప్పటి వరకూ మూడో, నాలుగో ప్రసంగాలే చేసినా అవి బహుళ చర్చనీయాంశాలయ్యాయి. 'నెహ్రూపై అన్ని విమర్శల్నీ ఒకేసారి చేయండి.. వాటిపై చర్చిద్దాం' అని ఆమె సవాలు విసిరిన తర్వాత పార్లమెంట్‌లో నెహ్రూపై అధికార పార్టీ విమర్శలు సద్దుమణిగాయి. ఓం బిర్లాపై పెట్టిన అవిశ్వాసంపై జరిగిన చర్చలో తృణమూల్ ఎంపీ, 33 ఏళ్ల సినీనటి సాయోనీ ఘోష్ అంత చక్కగా మాట్లాడి, బీజేపీ వైఖరిని ఎండగట్టగలరని ఎవరూ ఊహించలేదు. భారతీయ జనతా పార్టీ, ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ అదృష్టమేమంటే, ప్రతిపక్షాలు అటు ఎన్నికల రంగంలో దీటుగా నిలబడలేకపోవడంతో పాటు ఇటు పార్లమెంట్ వేదికను సరిగా ఉపయోగించుకోకపోవడమే. మోదీపై ధ్వజమెత్తేందుకు ఎన్నో అంశాలు కనపడ్డా, కాంగ్రెస్ విమర్శనాస్త్రాలు జనాన్ని అంతగా చేరుకోవడంలేదు. విచిత్రమేమంటే, భారతీయ జనతా పార్టీ అంత బలంగా లేని రాష్ట్రాల్లో కూడా మోదీ అత్యంత బలవంతుడని వాదించే మేధావులు కనపడుతున్నారు. ఉదాహరణకు కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో బీజేపీ అంత బలంగా లేదు. అయినా ఈ ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు పదినిమిషాలు మాట్లాడుకుంటే చాలు ఆ మాటా మంతీలో మోదీ పేరు పదే పదే ప్రస్తావనకు వస్తోంది. మోదీ బలాన్ని ఆయన కంటే ఎక్కువగా ఊహించేవారు పెరిగిపోతున్నారు. 'నన్ను విమర్శించినా నేరమే, విస్మరించినా నేరమే' అని గతంలో జర్మనీకి చెందిన ఒక నాయకుడు అన్నారట! ఈ పరిస్థితే జమిలి ఎన్నికలవైపు మోదీ దృష్టి మళ్లించేందుకు కారణమవుతోంది. దక్షిణాది రాష్ట్రాల విషయానికి వస్తే కర్ణాటకలో 2023లో ఓడిపోయిన తర్వాత బీజేపీ ఇప్పటి వరకూ కోలుకోలేదు. అంతర్గత కుమ్ములాటలతో పార్టీ సతమతమవుతోంది. రాజకీయాల్లో యడ్యూరప్ప 50 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. అయినా రాజకీయాల నుంచి వైదొలిగేందుకు సిద్ధంగా లేనని ఆయన స్పష్టం చేస్తున్నారు. మోదీ అనంతరం ఎవరు అధినేత అవుతారో జాతీయ స్థాయిలో అయోమయం నెలకొన్నట్లే కర్ణాటకలో యడ్యూరప్ప అనంతరం ఎవరు నాయకత్వం వహిస్తారో చెప్పలేని పరిస్థితి ఉన్నది. వచ్చే ఎన్నికల నాటికి కర్ణాటకలో బీజేపీ బలోపేతం అవుతుందా లేదా అన్నది ఆ పార్టీ నేతలే చెప్పలేరు. తెలంగాణలో బీజేపీ మూడో స్థానం నుంచి పైకి ఎదగడానికి నానా కష్టాలు పడుతోందని అందరికీ తెలుసు. అసెంబ్లీ ఎన్నికలకు వెళుతున్న కేరళలో బీజేపీ ఎంతశాతం ఓట్లు పెంచుకుంటుందో, కనీసం పది సీట్లు అయినా సాధిస్తుందో లేదో చెప్పడం సులభం కాదు.

# వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వపరంగా హామీ

### - త్వరలో కొన్ని డిమాండ్లు పరిష్కారం - ఛలో విజయవాడ భారీగా విజయవంతం - జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల






**విశాఖ: డాబాగార్డెన్స్, (రాజధాని వార్తలు):** రాష్ట్ర వ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ పరంగా కొంతమేర హామీ లభించినట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (ఎన్ఏజే) విశాఖ జిల్లా అధ్యక్షులు పి. నారాయ ణలు తెలిపారు. మంగళవారం డాబా గార్డెన్స్ వైజాగ్ జర్నలిస్టుల ఫోరం ప్రెస్ క్లబ్‌లో ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఏపీ బ్రాడ్ కాస్ట్ అసోసియేషన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌లు ఏర్పాటు చేసిన పాత్రికేయులు సమావేశంలో వీరు మాట్లాడారు. మార్చి 4న ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో విజయవాడ కార్యక్రమం పూర్తి స్థాయిలో విజయవంతం అయిందన్నారు. రాష్ట్రవిభజన తర్వాత జర్నలిస్టులు అంత పెద్ద మొత్తంలో తరలి రావడం ఇదే తొలిసారి అన్నారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన చేసిన సభలో వేలాది మంది జర్నలిస్టులు సమక్షంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సుమారు 13 అంశాలను పూర్తిస్థాయిలో తమ రాష్ట్ర నేతలు వివరించడం జరిగిందన్నారు. దాని ఫలితం వల్లే కొన్ని డిమాండ్లు త్వరలో పరిష్కారం కానున్నట్లు వీరు చెప్పారు. ఆరోజు సభలో మంత్రి పార్థసారథి ఒక్కొక్క అంశాన్ని తానే స్వయంగా నమోదు చేసుకున్నారని అందులో కొన్ని డిమాండ్లకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి చెప్పారన్నారు. ప్రధానంగా జర్నలిస్టుల సొంత ఇంటి కల ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో త్వరలో సాకారం అయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. గత రెండు ప్రభుత్వాలు హయాంలో జర్నలిస్టులు నానా ప్రయాసలు పడి దరఖాస్తులు చేసినప్పటికీ తగిన పరిష్కారం లభించలేదన్నారు. ఈసారి కూటమి ప్రభుత్వ హయాంలో తప్పకుండా జర్నలిస్టుల సొంత ఇంటి కల నెరవేరే అవకాశం ఉందన్నారు. ఇక పెన్షన్ విధానానికి సంబంధించి అధ్యయనం జరుగుతున్నదని చెప్పడం జరిగిందన్నారు. అలాగే ప్రమాద బీమా పాలసీ పునరుద్ధరణ జర్నలిస్టుల వృద్ధాశ్రమం వివిధ కమిటీల్లో జర్నలిస్టు సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించడం జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులకు విద్య వైద్యం కార్పొరేట్ సంస్థల నుంచి ఉచితంగా అవకాశం కల్పించాలని కార్మిక భీమా పాలసీ కు సంబంధించి సంబంధిత మంత్రి వాసంశెట్టి సుభాష్ కు తెలియజేశామన్నారు. ప్రభుత్వ పరంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్న కార్పొరేట్ సంస్థలకు భారీగా రాయితీలు కల్పిస్తున్నందున జర్నలిస్టులకు సామాజిక బాధ్యతగా ఆయా సంస్థలు విద్య, వైద్య, కార్మిక భీమా సదుపాయాలు కల్పించడం కష్టతరం కాదన్నారు. సుమారు 13 డిమాండ్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇందులో కొన్ని డిమాండ్లు తక్షణమే పరిష్కరించ వచ్చునని కూడా చెప్పామన్నారు.. అయితే ఇప్పటికే మంత్రి పార్థసారథి ఆయా డిమాండ్లను మంత్రివర్గ సమావేశంలో ప్రస్తావించినట్లు తమకు సమాచారం ఉందన్నారు.

అలాగే మంత్రి పరంగా కూడా కొన్ని చిన్న చిన్న డిమాండ్లు పరిష్కరిస్తామని తగిన హామీ ఇచ్చారన్నారు. అన్ని డిమాండ్లు ఒకేసారి కాకపోయినప్పటికీ చిన్న చిన్న డిమాండ్లు పరిష్కరించవచ్చునని తాము చెప్పామన్నారు. జర్నలి స్టుల పట్ల కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని త్వరలోనే కొన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పినట్లు వీరు వివరించారు.

చలో విజయవాడ ఉగాది సంబరాలు విజయవంతం చేసిన జర్నలిస్టులు అందరికీ ఫెడరేషన్ నేతలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో ఏపీ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ విశాఖ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు ఆర్గనైజింగ్ సెక్రటరీ డి రవికుమార్, ఉపాధ్యక్షులు రామకృష్ణ, నగేష్ బాబు, బ్రాడ్ కాస్ట్ విశాఖ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరావు, కింతాడ మదన్, త్రినాధ్, శేషు స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ విశాఖ అధ్యక్షులు జగన్మోహన్, ఇన్చార్జ్ కార్యదర్శి బొబ్బర ప్రసాద్, సంఘాల నేతలు రాజశేఖర్ జీవన్‌తో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# మేయర్ పీలాకు వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ సత్కారం - నగరాభివృద్ధికి కార్పొరేటర్లు కృషి

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మహా విశాఖ నగర పాలక సంస్థ మేయర్ పీలా శ్రీనివాసరావు పదవీకాలం మంగళ వారం నాటితో పూర్తి కావడంతో ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరే షన్, బ్రాడ్ కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించడం జరిగింది. మేయర్‌గా 11 నెలలు మాత్రమే పరిపాలన సాగించినప్పటికీ అందరి మన్ననలు పొందడం అంత సులభతరం కాదని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ నాయకులు గంట్ల శ్రీనుబాబు విశాఖ జిల్లా ఫెడరేషన్ అధ్యక్షులు పి.నారాయణ కార్యదర్శి జి.శ్రీనివాసరావులు కొనియాడారు. అలాగే 98 వార్డుల్లో కార్పొరేటర్లు కూడా తమ పదవీ కాలంలో వీలైన మేరకు అభివృద్ధి పనులు పూర్తి చేశారన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా నగరాభివృద్ధికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి జర్నలిస్టులు ఫెడరేషన్ తరపున అభినందనలు



తెలియజేసినట్లు వీరు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నేతలు జి.శ్రీనివాసరావు, రవికుమార్, ఈరోతి ఈశ్వరరావు, మదన్, జగన్మోహన్, రామకృష్ణ, మల్ల దేవ త్రినాథ్ శేషు, ఎమ్మెస్సార్ ప్రసాద్, వై.రామకృష్ణ, పట్టేపు. నాగేశ్వరరావు, రాజశేఖర్, కృష్ణలతోపాటు పెద్ద ఎత్తున జర్నలిస్టులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్ట్ గంట్లకు రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం

### - జర్నలిజం సేవా రంగంలో గుర్తింపు - 19న ముఖ్యమంత్రి చేతులు మీదుగా స్వీకరణ




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సీనియర్ పాత్రికేయులు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ నాయకులు గంట్ల శ్రీనుబాబుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకమైన పరాభవ నామ ఉగాది పురస్కారం ప్రకటించింది. జర్నలిజం, సేవారంగంలో ఆయన చేస్తున్న విశేష సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు జీవో నెంబర్ 27ను రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. ఉగాది పర్వదినం సందర్భంగా గురువారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి కందుల దుర్గేష్, ఇతర ప్రముఖులు చేతులు మీదుగా గంట్ల శ్రీనుబాబు ఈ అవార్డును స్వీకరించనున్నారు. ఇప్పటికే అనేక జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి పురస్కారాలు గంట్ల శ్రీనుబాబు స్వీకరించారు. మూడు దశాబ్దాలుగా గంట్ల శ్రీనుబాబు జర్నలిజంలో కొనసాగుతూ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు అనేక దేవాలయాలకు గౌరవ అధ్యక్షుడిగా, డాక్‌యార్డు కేటిబి అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా,విశాఖ కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులుగా కొనసాగుతూ ఇంకా అనేక సంస్థలకు సలహాదారుడిగా కొనసాగుతూ తన సేవలు అందిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం లభించడంతో గంట్ల శ్రీనుబాబును పలువురు జర్నలిస్టులు అభినందించారు.

# అయిదేళ్ల సహకారానికి కృతజ్ఞతలు

### - కౌన్సిల్ చివరి సమావేశంలో జ్ఞాపికలు - అభివృద్ధి పనులకు ఆమోదం



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ఐదేళ్ల కౌన్సిల్ ప్రయాణంలో సహకరించిన మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్‌కు, తోటి కౌన్సిల్ సభ్యులకు, అధికారులకు కృతజ్ఞతలు అంటూ మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు హృద్ పూర్వక అభినందనలు తెలిపారు. పెద్దాపురం మున్సిపాలిటీలో మున్సిపల్ కౌన్సిల్ చివరి సమావేశం చైర్‌పర్సన్ తులసి మంగతాయారు అధ్యక్షతన మంగళవారం జరిగింది. దీనిలో చైర్ పర్సన్ మాట్లాడుతూ గత ఐదేళ్ల కౌన్సిల్ పాలనలో పట్టణాభివృద్ధికి సంబంధించి పూర్తి సహకారాన్ని అందించిన అధికా రులందరికీ, దానికి కృషి చేసిన వార్డు సభ్యులందరికీ, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, తమను ఈ స్థానంలో నిలబెట్టిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి, వైసిపి పెద్దాపురం ఇన్చార్జి దవులూరు దొరబాబులకు ఆమె తొలుత కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అత్యవసర సమావేశానికి సంబంధించి సిద్ధం చేసిన ఏడు అంశాలతో కూడా ఎజెండాను, తదుపరి 30 అంశాలతో రూపొందించిన సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించి, పట్టణ అభివృద్ధికి సంబంధించి అన్ని వార్డుల అభివృద్ధి పనులకు మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ నేతృత్వంలో తయారుచేసిన పనుల వివరాలను సభ్యులకు వివరించి వాటిని ఆమోదించారు.

**కౌన్సిల్‌కు అభినందనలు :**

కౌన్సిల్ పదవీకాలం ముగియడంతో మున్సిపల్ కమిషనర్ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ తులసి మంగతాయారు, వైస్ చైర్మన్‌తో పాటు అందరు కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులను అధికారులు సత్కరించి జ్ఞాపికలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులంతా కొంత సమ యం ఆనందంగా కౌన్సిల్ హాల్‌లో గడిపారు. గ్రూప్ ఫోటో దిగి వారి పదవీ కాలపు జ్ఞాపకాలను భద్రపరచుకున్నారు. ఈ కౌన్సిల్ సమావేశంలో అందరూ మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్యాస్ కోసం పడిగాపులు




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో గ్యాస్ కోసం ఆయా ఏజెన్సీల వద్ద ప్రజలు బారులు తీరి పడిగాపులు పడ్డారు. సక్రమంగా గ్యాస్ బుకింగ్ జరగకపోవడం, పంపిణీ కూడా లభించకపోవడంతో మంగళవారం గ్యాస్ ఏజెన్సీల వద్ద ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్‌కు కొరత లేదని జిల్లా స్థాయి అధికారులు ప్రకటనలు చేస్తుండగా, బుకింగ్ మాత్రం సరిగా జరగటం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో గ్యాస్ కొరత అధికంగా ఉందని, అధికారులు పట్టించుకోవడం లేదని సర్వత్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సక్రమ గ్యాస్ పంపిణీకి జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతు న్నారు. గ్యాస్ కనెక్షన్ లేకుండా గ్యాస్ సిలిండర్లు వాడుతున్న అనేకమంది పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఏజెంట్లు ఇతరుల సహాయంతో గ్యాస్ సిలిండర్లు పొందే సామాన్య ప్రజలకు నేడు గ్యాస్ దొరకడం లేదు. ఈ ఇబ్బందులపై జిల్లా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

# నవోదయ ప్రవేశ పరీక్షలో అవంతికకు జిల్లాస్థాయి 33వ ర్యాంకు



**కరప, (రాజధాని వార్తలు):** నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలో కరప మండలం యండమూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఐదవ తరగతి విద్యార్థిని గుబ్బల అవంతిక జిల్లాస్థాయిలో 33వ ర్యాంకు సాధించి ప్రతిభ కనబర్చింది. మంగళవారం విడుదలైన నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఈ ర్యాంకు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చింది. అవంతిక భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని వారు ఆకాంక్షించారు. విద్యార్థిని సాధించిన ఈ విజయంపై మండల విద్యాశాఖ అధికారులు కె.బి.కృష్ణవేణి, పి.సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు ఏ.కామేశ్వరరావు, ఎం.ఏ.అలీమ్ హర్షం, సర్పంచ్ శివ, అవంతికను అభినందించారు.

# ఉస్తాద్ ఎక్స్‌పెరిమెంట్.. రేట్లు తగ్గినా రికార్డులు పెరుగుతాయా?



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్ ఉస్తాద్ భగత్ సింగ్ ఉగాది కానుకగా ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతోంది. డైరెక్టర్ హరీష్ శంకర్ తెరకెక్కించిన ఈ సినిమాలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించింది. సినిమా రిలీజ్‌కు ముందు నిర్వహించిన ప్రెస్ మీట్‌లో మేకర్స్ మూవీ గురించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తెలంగాణలో సాధారణ రేట్లతోనే రిలీజ్ ఈ మధ్య కాలంలో స్టార్ హీరోల సినిమాలకు తెలుగు రాష్ట్రాల్లో టికెట్ ధరలు పెంచడం ఒక సాధారణ ధోరణిగా మారింది. అయితే ఉస్తాద్ భగత్ సింగ్ విషయంలో మాత్రం మేకర్స్ విభిన్న నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణలో ఈ సినిమాను సాధారణ టికెట్ రేట్లతో రిలీజ్ చేయాలని నిర్ణయించామని నిర్మాత మైత్రీ నవీన్ వెల్లడించారు. సుప్రీమ్ కోర్ట్ తీర్పు తర్వాత ప్రభుత్వంతో సమావేశమయ్యే అవకాశం లేకపోవడంతో పాటు, టికెట్ ధరల పెంపు లేకుండా సినిమా ఎలాంటి ఫలితాన్నిస్తుందో పరిశీలించాలనే ఉద్దేశంతోనే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ నిర్ణయం పరిశ్రమలోనే కాకుండా ప్రేక్షకుల్లో కూడా చర్చనీయాంశంగా మారింది. భారీ అంచనాలు ఉన్న స్టార్ సినిమా అయినప్పటికీ టికెట్ రేట్లు పెంచకుండా విడుదల చేయడం అరుదైన విషయంగా భావిస్తున్నారు. ఇది బాక్సాఫీస్ కలెక్షన్లపై ఎలాంటి ప్రభావం చూపుతుందో అన్నదానిపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది. కాగా ప్రెస్ మీట్‌లో మరో హైలైట్‌గా నిలిచింది దర్శకుడు హరీష్ శంకర్ లీక్ చేసిన డైలాగ్. ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ చెప్పే డైలాగ్‌ను హరీష్ లీక్ చేశారు. భగవద్గీతను యుద్ధం మధ్యలో చెప్పారు కానీ, యుద్ధాన్ని మధ్యలో వదిలేయమని చెప్పలేదు అనే డైలాగ్ ను సినిమాలో పవ్ చెప్తారని హరీష్ చెప్పడంతో ఆ డైలాగ్ అభిమానుల్లో ఉత్సాహాన్ని మరింత పెంచింది.

# మారుతి ఎఫెక్ట్.. హరీష్ సేఫ్ ప్లాన్‌లో ఉన్నారా?





పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లీడ్ రోల్‌లో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ ఉస్తాద్ భగత్ సింగ్‌పై రోజురోజుకు ఆసక్తి పెరుగుతోంది. ఆ చిత్రానికి దర్శకత్వం వహించిన హరీష్ శంకర్.. సినిమాను ఎంతో జాగ్రత్తగా ముందుకు తీసుకెళుతున్నట్టు ఇప్పుడు టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా సినిమా ప్రమోషన్స్ విషయంలో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. గతంలో దర్శకుడు మారుతి చేసిన కొన్ని మిస్టేక్స్‌ను దృష్టిలో పెట్టుకుని, హరీష్ శంకర్ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని సమాచారం. మారుతి తన సినిమా ప్రచారంలో భాగంగా అనవసర విషయాలు, వ్యక్తిగత వివరాలు బయట పెట్టడం వల్ల ఆ సినిమా మీద నెగిటివ్ ఎఫెక్ట్ పడిందనే విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అలాంటి పొరపాట్లు రిపీట్ చేయకుండా హరీష్ శంకర్ జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. ఉస్తాద్ భగత్ సింగ్ మూవీ ప్రమోషన్స్‌లో హరీష్ శంకర్ పూర్తిగా పవన్ కళ్యాణ్ ఇమేజ్, ఆయన ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్ పైనే ఫోకస్ పెడుతున్నారని సమాచారం. సినిమా ఎంత రికార్డులు సృష్టిస్తుంది, ఎన్ని వసూళ్లు వస్తాయి వంటి అంశాలపై పెద్దగా వ్యాఖ్యలు చేయకుండా ఉంటున్నట్లు కనిపిస్తున్నారు. కంటెంట్ మీద ప్రేక్షకుల దృష్టిని నిలిపే ప్రయత్నం చేస్తున్నారని స్పష్టంగా అర్థమవుతుంది. నిజానికి.. ఇటీవల కాలంలో కొన్ని సినిమాలు రిలీజ్ కు ముందే భారీ హైప్ సృష్టించి, రికార్డుల గురించి ఎక్కువగా మాట్లాడటం వల్ల అంచనాలు ఆకాశాన్ని తాకాయి. అయితే రిలీజ్ తర్వాత ఆ అంచనాలను అందుకోకపోవడంతో నిరాశ కలిగిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో హరీష్ శంకర్ ఆ దారిలో వెళ్లకుండా.. సరైన ప్రచారంతో ముందుకు సాగడం విశేషమని చెప్పాలి. అదే సమయంలో పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్‌లో ఇప్పటికే ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.


ఆయన రాజకీయాల మధ్యలో కూడా సినిమాలకు సమయం కేటాయించడం, అలాగే హరీష్ శంక ర్‌తో ఆయనకు ఉన్న హిట్ కాంబినేషన్ కారణంగా ఉస్తాద్ భగత్ సింగ్ పై ఆసక్తి మరింత పెరిగింది. ఆ అంచనాలను సరిగ్గా మేనేజ్ చేయడం దర్శకుడికి పెద్ద సవాల్‌గా మారింది. సినిమా ప్రమోషన్ అనేది కేవలం ప్రచారం మాత్రమే కాకుండా, ప్రేక్షకులలో సరైన ఫీలింగ్ ను క్రియేట్ చేసే ప్రాసెస్ కూడా. ఆ విషయంలో హరీష్ శంకర్ తీసుకుంటున్న జాగ్రత్తలు భవిష్యత్తులో ఇతర దర్శకులకు ఒక పాఠంగా మారే అవకాశం ఉంది. ఏదేమైనా హరీష్ ప్రమోషన్స్ చేస్తూనే, ఎక్కడ అవసరమో అక్కడే మాట్లాడటం, అనవసర హైప్‌కు దూరంగా ఉండటం ద్వారా ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాను సేఫ్ జోన్‌లో ఉంచే ప్రయత్నం చేస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. రిలీజ్ తర్వాత ఆ ప్లాన్ ఎంతవరకు వర్కౌట్ అవుతుందో తెలియనుంది.

# మంచు లక్ష్మి ఇంట స్పెషల్ ఈవెంట్.. కూతురు ఎంత క్యూట్‌గా ఉందో!



టాలీవుడ్ ప్రముఖ నటి, నిర్మాత మంచు లక్ష్మి ఇంట సందడి వాతావరణం నెలకొంది. ఆమె ఏకైక కుమార్తె విద్యా నిర్వాణ ఓణీ వేడుక (హాఫ్ శారీ ఫంక్షన్) హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ రిసార్టులో మార్చి 15న గ్రాండ్‌గా నిర్వహించినట్లు తెలుస్తోంది. ఆ ఈవెంట్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఆకట్టుకుంటున్నాయి. ట్రెడిషనల్ అవుట్ ఫిట్ లో విద్యా నిర్వాణ ఎంతో అందంగా, ముద్దుగా కనిపించిందని నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆ వేడుకను పూర్తిగా కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు, బంధుమిత్రుల మధ్య నిర్వహించడం ప్రత్యేకంగా నిలిచింది. ఆత్మీయ వాతావరణంలో జరిగిన ఆ కార్యక్రమం మంచు కుటుంబానికి ప్రత్యేక గుర్తుగా నిలిచిందని చెప్పొచ్చు. ఈ సందర్భంగా మంచు లక్ష్మి తన హ్యాపీ నెస్‌ను సోషల్ మీడియాలో పంచుకున్నారు. “నా కుమార్తె ఆశీర్వాద వేడుక ఇది. ఈ అందమైన వేడుకను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన నా డ్రీమ్ టీమ్‌కు కృతజ్ఞతలు” అని ఆమె పేర్కొన్నారు. దక్షిణ భారత సంప్రదాయంలో అమ్మాయిలు యుక్త వయసులోకి అడుగుపెట్టిన సందర్భంగా ఓణీ వేడుక నిర్వహించడం ఆనవాయితీ. అదే సంప్రదాయాన్ని మంచు కుటుంబం ఇప్పుడు ఫాలో అయింది. కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు మనవరాలు అయిన విద్యా నిర్వాణకు ఆ వేడుకను అత్యంత ఘనంగా జరిపినట్లు ఫొటోల ద్వారా కనిపిస్తోంది. కుటుంబ సభ్యులందరూ కలిసి పాల్గొని ఆ కార్యక్రమాన్ని మరింత ప్రత్యేకంగా మార్చారు. చిన్నప్పటి నుంచి సోషల్ మీడియాలో అప్పుడప్పుడు కనిపించే విద్యా నిర్వాణ, ఇప్పుడు మరింత అందంగా కనిపిస్తోందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. అయితే విద్యా నిర్వాణ ఫారిన్ లో చదువుకుంటూ తన ప్రతిభను చాటుకుంటోంది. చిన్న వయసులోనే చెస్ ట్రైనర్‌గా గుర్తింపు పొందడం విశేషం. సినీ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ ఇప్పటివరకు సినిమాల్లో నటించకపోవడం గమనార్హం. భవిష్యత్తులో ఆమె కూడా నటిగా ఎంట్రీ ఇస్తుందేమోనని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అదే సమయంలో మంచు లక్ష్మి గతంతో పోలిస్తే ఇటీవల సినిమాల్లో తక్కువగా కనిపిస్తున్నారు. టెలివిజన్ కార్యక్రమాల్లో కూడా ఆమె సందడి తగ్గింది. ప్రస్తుతం ఎక్కువ సమయం ముంబైలో గడుపుతూ, అవసరమైనప్పుడు మాత్రమే హైదరాబాద్‌కు వస్తున్నట్లు సమాచారం. గత ఏడాది లేడీ ఓరియెంటెడ్ మూవీగా వచ్చిన దక్ష సినిమాలో నటించిన ఆమె, ఈ ఏడాది బూకీ అనే తమిళ-తెలుగు ద్విభాషా చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా మంచు కుటుంబంలో జరిగిన విద్యా ఓణీ వేడుక ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆ వేడుకకు సంబంధించిన పిక్స్, వీడియోస్ సూపర్ రెస్పాన్స్ అందుకుంటున్నాయి.

# 'విరోష్' బ్రాండ్‌కు భారీ ఆఫర్స్.. కానీ..



టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారిన విరోష్ జంట ఇప్పుడు బ్రాండింగ్ వరల్డ్‌లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలుస్తోంది. హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక మందన్న కలిసి కనిపిస్తే అభిమానులు ఎంతగా స్పందిస్తారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మొదటి నుంచే ఆ జంటపై సోషల్ మీడియాలో మంచి క్రేజ్ ఉంది. క్యూట్ కపుల్‌గా పేరొందిన వీరిద్దరి కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వచ్చింది. ఇటీవల వీరిద్దరి వివాహం జరగ్గా.. బయటకు వచ్చిన ఫోటోలు సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అయ్యాయి. ఆ ఫోటోలకు 20 మిలియన్లకు పైగా లైక్స్ రావడం విశేషం. రికార్డు స్థాయి రెస్పాన్స్‌తో విరోష్ బ్రాండ్ దేశవ్యాప్తంగా ట్రెండింగ్‌లో నిలిచింది. ఇంటర్నేషనల్ లెవెల్‌లో ఆ పోస్టులు చర్చనీయాంశంగా మారాయి. సోషల్ మీడియాలో అత్యధిక లైక్స్ సాధించిన పోస్టులతో ఏకంగా పోటీ పడడం గమనార్హం. ఇటీవల వీరిద్దరి వివాహం జరగ్గా.. బయటకు వచ్చిన ఫోటోలు సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అయ్యాయి. ఆ ఫోటోలకు 20 మిలియన్లకు పైగా లైక్స్ రావడం విశేషం. రికార్డు స్థాయి రెస్పాన్స్‌తో విరోష్ బ్రాండ్ దేశవ్యాప్తంగా ట్రెండింగ్‌లో నిలిచింది. ఇంటర్నేషనల్ లెవెల్‌లో ఆ పోస్టులు చర్చనీయాంశంగా మారాయి. సోషల్ మీడియాలో అత్యధిక లైక్స్ సాధించిన పోస్టులతో ఏకంగా పోటీ పడడం గమనార్హం. అదే సమయంలో ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్ ఫ్లిక్స్ కూడా వీరి పెళ్లి హక్కులను కొనుగోలు చేయాలని ప్రయత్నించినట్లు సమాచారం. పెళ్లి వేడుకకు సంబంధించిన ఫుటేజ్‌ను ప్రసారం చేయాలనే ఉద్దేశంతో పెద్ద మొత్తంలో ఆఫర్ ఇచ్చిందట. అయితే, వ్యక్తిగత జీవితాన్ని పబ్లిక్ చేయాలనుకోకపోవడంతో విజయ్, రష్మిక ఆ ఆఫర్ ను తిరస్కరించినట్లు తెలుస్తోంది. తమ వ్యక్తిగత విషయాలను వ్యాపార ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదనే అభిప్రాయంతో ఆ నిర్ణయం తీసుకున్నారని టాక్. అయితే విరోష్ పెళ్లికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వారి వద్దనే ఉన్నాయి. ఆ ఫుటేజ్‌ను సోషల్ మీడియాలో విడుదల చేసినా భారీ ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయినప్పటికీ ఇప్పటివరకు వారు ఆ దిశగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇది కూడా అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. ఇదే సమయంలో అనేక ప్రముఖ బ్రాండ్లు ఆ జంటను కమర్షియల్ యాడ్స్ కోసం సంప్రదిస్తున్నాయట! భారీ రేంజ్‌లో ఆఫర్స్ ఇస్తుండడంతో విరోష్ బ్రాండ్ వాల్యూ ప్రస్తుతం అత్యంత హైయెస్ట్ రేంజ్‌కు చేరిందని మార్కెట్‌లో టాక్ వినిపిస్తోంది. తమ బ్రాండ్‌తో సందడి చేస్తే భారీ స్థాయిలో రీచ్, ఎంగేజ్మెంట్ వస్తుందని కంపెనీలు భావిస్తున్నాయి. అందుకే కోట్ల రూపాయల ఆఫర్లతో జంటను సంప్రదిస్తున్నట్టు తెలుస్తోంది. కానీ విజయ్, రష్మిక ఇంట్రెస్ట్ చూపించడం లేదని సమాచారం. సాధారణంగా చాలా మంది సెలబ్రిటీలు పెళ్లి తర్వాత బ్రాండ్ విలువ పెరగడం సహజమే. కానీ విరోష్‌కు భారీగా డిమాండ్ రావడం అరుదైన విషయం. ఇప్పటివరకు ఎన్నో సెలబ్రిటీ జంటలు వివాహం చేసుకున్నా, ఈస్థాయి కమర్షియల్ ఇంట్రెస్ట్ కనిపించలేదని టాక్ వినిపిస్తోంది.

# ప్రతి రైతుకూ అండగా ప్రభుత్వం

## - గిరిజన కుటుంబాల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యం - పశుసంపద వృద్ధితో గ్రామీణ ఉపాధి, ఆదాయం పెంపు - రైతన్నా మీకోసంలో రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడి





**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి రైతుకూ అండగా నిలుస్తోందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. గిరిజన ప్రాంతాల్లోని రైతులకు సాగునీరు, విత్తనాలు, ఎరువుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వ్యవసాయంతో పాటు గిరిజన ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అలాగే గిరిజన కుటుంబాల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని, పశుసంపద వృద్ధితో గ్రామీణ ఉపాధి, ఆదాయం పెంపొందుతుందని తెలిపారు. పాచిపెంట మండలం కర్రివలస పంచాయతీ పరిధిలోని అమ్మవలస గ్రామంలో రైతన్నా మీకోసం – మెగా పాడి పశువుల పంపిణీ కార్యక్రమం ఐటీడిఎ, వ్యవసాయ – పశు సంవర్ధక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి, జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డితో కలిసి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గానికి 650 నాటుకోళ్ల పెంపకం యూనిట్లు మంజూరు అయ్యాయని, ఒక్కో మండలానికి (పాచిపెంట, సాలూరు, మెంటాడ) దాదాపు 200 యూనిట్ల వరకు వచ్చాయని తెలిపారు. గిరిజనులు ఆర్థికంగా ఎదగడానికి, పిల్లలను బాగా చదివించుకోవడానికి ఈ పథకాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గిరిజన పిల్లలు హాస్టళ్లలో ఉండి చదువు కోవడానికి పునాది వేసింది నందమూరి తారక రామారావు అని కొనియాడారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనులే టీచర్లుగా ఉండాలని నిర్ణయం తీసుకోవడం వల్ల నేడు అనేక మంది స్థానికులు ఉద్యోగాల్లో ఉన్నారని గుర్తు చేశారు. మహిళల కోసం ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ (ఏడాదికి మూడు) గురించి ప్రస్తావించారు. 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా రైతులకు 20,000 రూపాయల ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. ఇంటింటికీ పింఛన్ల పంపిణీ సాఫీగా జరుగుతోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా 4000 నుండి 15,000 రూపాయల వరకు వివిధ రకాల పింఛన్లు అందుతున్నాయని వివరించారు. మహిళల కోసం ఉచిత బస్సు సౌకర్యం అమలులో ఉందని, ఇది వారి ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని చెప్పారు. రేపటి నుండి దివ్యాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని ప్రకటించారు. దివ్యాంగులు తమ సర్టిఫికెట్ లేదా కార్డు చూపిస్తే ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. మొత్తంగా, ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం, మహిళల భద్రత మరియు రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఐటీడిఎ – ట్రైకార్ ద్వారా గిరిజనులకు పాడి పశువులను నేడు పంపిణీ చేసుకుంటున్నామన్నారు. సుమారు రూ.5.86 కోట్ల వ్యయంతో మొత్తం 451 యూనిట్లు గల 902 పశువులను పంపిణీ చేసుకున్నట్లు చెప్పారు. ఒక్కో యూనిట్ ధర రూ.65,000/–లు కాగా, అందులో 75% సబ్సిడీని ప్రభుత్వమే అందజేస్తుందని, మిగిలిన 25% మాత్రమే లబ్ధిదారుడి వాటా అని గుర్తుచేసారు. పశువుల కొనుగోలు ధర రూ.58–60 వేల మధ్య ఉండగా, ప్రతి పశువుకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించినట్లు చెప్పారు. ఇందులో అత్యధికంగా మక్కువ 127, పాచిపెంట 109, సాలూరు 68 యూనిట్లు ఉన్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో పశువు రోజుకు 8–12 లీటర్ల పాల దిగుబడి రాగా, దీంతో అదనపు ఆదాయం లభిస్తుందని అన్నారు. గిరిజన కుటుంబాల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పశు సంపదపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో 202 దూడలను ప్రదర్శించడం జరిగిందని అన్నారు. 50% సబ్సిడీతో పశువులకు ఆహారం పంపిణీ చేయగా, దీంతో 11,931 మంది పాడి రైతులు లబ్ధి పొందినట్లు చెప్పారు. ఇప్పటివరకు మొత్తం 596.55 మెట్రిక్ టన్నుల పశు ఆహారం పంపిణీ చేసినట్లు మంత్రి వివరించారు. జిల్లాలో ఖీవీణ టీకా కార్యక్రమం ప్రారంభం అయిందని, 2.38 లక్షల డోసులు అందుబాటులో ఉన్నాయన్నారు. మొబైల్ వెటర్నరీ క్లినిక్ ద్వారా గ్రామాల వద్దే వైద్య సేవలు అందిస్తారని, పాడి రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వేసవిలో పశుసంరక్షణపై సూచనలు చేస్తూ నీరు, నీడ, పోషకాహారం కీలకమన్నారు. పశుసంపద అభివృద్ధితో గ్రామీణ ఉపాధి, ఆదాయం పెంపు లక్ష్యం కావాలని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం గోకుల షెడ్, క్యాబ్ బుకింగ్ తరహాలో డ్రోన్ సేవలు, జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం పోస్టర్లు, బ్యానర్లను మంత్రి కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. పాల క్యాన్లను, పీఎండిఎస్ నవ ధాన్యాల బస్తాలను, 451 పాడి పశువుల కొనుగోలు కొరకు రూ. 5,86,30,000/–ల చెక్కును మంత్రి పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో రైతుల నుంచి అందే వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలు, విద్యుత్ సరఫరా మరియు రెవెన్యూ అంశా లపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి రైతుకూ అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి, కలెక్టర్ కలిసి రైతుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. పాడి రైతులకు చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా. ఎస్.మన్మథరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, ఏపీఓ పి.మురళీధర్, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఐటిడిఏ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ నూకాలమ్మవారి 68వ వార్షిక జాతర మహోత్సవంలో సిరమ్మ





**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరంలోని పాత పశువుల మార్కెట్ దగ్గర మంగళ వీధిలో కొలువై వున్న శ్రీ శ్రీ శ్రీ నూకాలమ్మ వారి 68వ వార్షిక జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజవర్గం సమన్వయకర్త గౌ!! మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ మంగళవారం ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ అమ్మవారి జాతరలో పాల్గొన్న సిరమ్మకి నూకాలమ్మ వారి ఉత్సవ కమిటీ సభ్యులు మరియు స్థానిక ముఖ్య నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ నూకాలమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితుల ఆశీర్వాదం పొందారు. తదనంతరం కమిటీ వారు ఏర్పాటు చేసిన ప్రసాదంను తాను స్వయంగా భక్తులకు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి కృప కటాక్షాలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో కలిగి



ఉండాలని ఆమె కోరారు. ఉత్సవ కమిటీలు ఇటువంటి కార్యక్రమాలు చేయడంవలన ప్రజల్లో భక్తి భావాన్ని, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో 25వ డివిజన్ కార్పొరేటర్ యడ్ల రాజేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్య కర్తలు, భక్తులు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొల్లి గంగమ్మ గావు పండుగ



**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ గ్రామంలో సుమారుగా 60 సంవత్సరాల తదుపరి జరుగుతున్న యాదవ కులుస్తుల కులదేవత ఆరాధ్య దైవం కొల్లి గంగమ్మ గావు పండుగ మంగళ వారం నాడు సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక యాదవ్ వీధిలో విద్యుత్తు దీపాలంకరణలతో పెద్ద పెద్ద పందిర్లు వేసి వీధిని ఆకర్షణీయంగా అలంకరించారు. స్థానిక వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు మావుడి రంగు నాయుడు శ్రీ కొల్లి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. అనంతరం ఐదు వేల మందికి అమ్మవారి అన్న ప్రసాదన కార్యక్రమాన్ని నిర్వహించారు. పండగ సందర్భంగా ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా స్థానిక ఎస్సై ఎం వెంకటరమణ తమ సిబ్బందితో పండగ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో యాదవ వీధి పెద్దలు మరియు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పండగను విజయవంతం చేశారు.

# పాసుపుస్తకాల పంపిణీ వేగంగా పూర్తి

## కావాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి






**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీని వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టాదారు పాసుపుస్తకాలు, రీసర్వే, 22 ఏ భూములు తదితర రెవెన్యూ అంశాలపై దిశానిర్ధేశం చేశారు. జిల్లాలోని పరిస్థితులను సి.ఎస్‌కు కలెక్టర్ వివరించారు. ఈ వి.సి అనంతరం కలెక్టర్ రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా అధికారులకు పలు ఆదేశాలను జారీ చేశారు. ప్రతీ నెలా 9వ తేదీలోగా నిర్ధేశించిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీని పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఒక్క తప్పుకూడా లేకుండా పాసుపుస్తకాలను రూపొందించాలని, రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు.

అదేవిధంగా మ్యుటేషన్లను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, డి.ఆర్.ఓ సి.హెచ్.సత్తిబాబు, ఆర్.డి.ఓలు వెంకటేశ్వర్రావు, సుధారాణి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

# అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఆటంకాలు లేకుండా చూడాలి

## - అధికారుల సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ స్పష్టీకరణ





**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న రహదారులు మరియు భవన నిర్మాణ పనులకు సంబంధించి అటవీ శాఖ అభ్యంతరాలను నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించి, పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబరులో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అటవీ మరియు ఇంజనీరింగ్ శాఖల అధికారులతో కలిసి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రోడ్ల నిర్మాణానికి సంబంధించి అటవీ శాఖ నుండి ఉన్న అభ్యంతరాలను నిబంధనల ప్రకారం త్వరితగతిన క్లియర్ చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రాబోయే కాలంలో నిర్మించబోయే రహదారులకు సంబంధించి ముందుగానే ప్రతిపాదనలు సిద్ధం చేసి, సర్వే సమయంలోనే అవసరమైన అనుమతులు పొందాలని సూచించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు మరియు ఇతర ప్రభుత్వ భవన నిర్మాణాలకు సంబంధించి ఎటువంటి జాప్యం లేకుండా అనుమతులు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులను డివిజన్ మరియు పనుల వారీగా విశ్లేషించి, ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, జిల్లా అటవీ అధికారి జి.ఎ.పి.ప్రసూన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఐటీడీఏ అధికారులు, డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అటవీ క్షేత్ర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన జీవీఎంసీ కౌన్సిల్ వీడ్కోలు సభ






**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** 2021-26 జీవీఎంసీ కౌన్సిల్‌కు ఘన వీడ్కోలు సభా కార్యక్రమాన్ని ఋషి కొండ సమీపంలో సాయి ప్రియా రిసార్ట్లో ముఖ్యఅతిథి దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్, విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్లు దల్లి గోవింద రాజు, కట్టమూరు సతీష్, అన్ని పార్టీలకు ఫ్లోర్ లీడర్లు, కార్పొరే టర్లుతో కలిసి జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీని వాస్ మాట్లాడుతూ 2021-26 జీవీఎంసీ కౌన్సిల్ చరిత్రలో ఎప్పటికీ మిగిలిపోతుంది అన్నారు. విశాఖ నగర అభివృద్ధి దిశగా మేయర్లు, డిప్యూటీ మేయర్లు, ఫ్లోర్ లీడర్లు,వార్డు కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు ప్రజల సేవల దిశగా విశాఖ నగర అభివృద్ధికి నిత్యం కృషి చేస్తూ విశాఖ నగర కీర్తిని మరింత పెంచారన్నారు. ప్రపంచ దేశాలు నేడు విశాఖ నగరం వైపు చూస్తున్నాయని ఆ దిశగా జీవీఎంసీ కౌన్సిల్ పనితీరు ఎప్పటికీ అందరికీ గుర్తుండి పోతుందన్నారు. ప్రజలకు సేవ చేసేలా నగర అభివృద్ధికి కృషి చేసినప్పుడు ఆ వ్యక్తికి గౌరవం మరింత పెరుగుతుందన్నారు. ఎప్పుడు గౌరవంగా జీవించే పదవులను అందరూ చేపట్టాలని ఈ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. విశాఖ నగర మేయరుగా పీలా శ్రీనివాసరావు తక్కువకాలం పదవిలో ఉన్నప్పటికీ ఆ కాలంలో విశాఖ నగర అభివృద్ధికి ఎన్నో పనులను మంజూరు చేయడం ద్వారా చరిత్రలో మిగిలిపోతారు అన్నారు. ఇటు వంటి మంచి కార్యక్రమాన్ని జీవీఎంసీ కమిషనర్ నిర్వహించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు ఎమ్మెల్యే కమిషనర్‌కు తెలిపారు. అనంతరం నగర మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల ఓట్లతో జీవీఎంసీ కౌన్సిల్లో అడుగుపెట్టి విశాఖ నగర అభివృద్ధికి సేవలందించినందుకు చాలా తృప్తినిచ్చిందని, ఈరోజు కౌన్సిల్ పెడుతున్నందుకు బాధగా ఉన్న ప్రజాసేవకు అంకితమైనందుకు ఆనందంగా ఉందన్నారు. కార్పొరేటర్లు జీవీఎంసీ కమిషనర్, అధికారులు, ఉద్యోగులు ఒక కుటుంబంలో విధులు నిర్వహిస్తూ ఈ కౌన్సిల్‌ను నడిపినందుకు ఆనందంగా ఉందన్నారు. యోగాంధ్ర, సిఐఐ సమ్మె టు, ఐఎఫ్ ఆర్, విశాఖ ఉత్సవ్ తదితర అంతర్జాతీయ కార్యక్రమాలకు జీవీఎంసీ కార్యాచరణ అమోఘమని, ప్రపంచ చరిత్రలో విశాఖ ఎప్పటికీ నిలిచి ఉంటుంది అన్నారు. పది నెలల 20 రోజుల్లో జీవీఎంసీ అభివృద్ధికి నా వంతు కృషి చేశానన్నారు. కౌన్సిల్ నడపడంలో తప్పొప్పులను సరిదిద్దానని, ముఖ్యంగా ఎంపీ, ఎమ్మెల్యేల సహకారం మరింత సంతోషాన్ని ఇచ్చిందన్నారు. రాజకీయాలు, పదవులు శాశ్వతం కాదని విశాఖ అభివృద్ధిలో భాగస్వామ్యమయి ప్రధాని, రాష్ట్రపతులకు స్వాగతం పలికే అవకాశం లభించడం నా అదృష్టం అన్నారు. విశాఖ నగరానికి అవార్డు లభించినప్పుడు అవి అందుకునే సమయంలో చాలా ఆనందం పొందానన్నారు. రాజకీయం కన్నా ఎప్పుడూ ఒక మాటకు కట్టుబడి ఉంటానని జీవీఎంసీ యంత్రాంగం నగర అభివృద్ధికి నిరంతరం ఇలాగే కృషి చేస్తూ విశాఖ కీర్తి ప్రతిష్టలను మరింత పెంచాలని ఆ దిశగా జీవీఎంసీ కమిషనర్ సహకరిస్తున్న తీరు అభినందనీయమన్నారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ 15000 కోట్ల అభివృద్ధి పనులు ఈ కౌన్సిల్ సాధించిందని, జీవీఎంసీ చరిత్రలో ఎప్పటికీ నిలిచి ఉంటుందన్నారు. విశాఖ నగర్ మేయర్ పీలా శ్రీనివాసరావు అందించిన సహకారం మరువలేనిదని, కొంతమంది కౌన్సిల్ సభ్యులు సభలో మాట్లాడే పద్ధతి కొన్ని విషయాలను తెలుసుకునేలా చేసిందన్నారు. కౌన్సిల్లో గొడవలు, రగడ ఉన్న చాలా విషయాలు విశాఖ నగర అభివృద్ధి దిశకు నేర్చుకోవచ్చునన్నారు. ఐఏఎస్ కన్నా కార్పొరేటర్లకు ఎక్కువ అనుభవం ఉంటుందని, జీవీఎంసీకి ఏ సమయంలోనైనా వచ్చి ప్రజా సమస్యలను తెలియపరచాలన్నారు. ముఖ్యంగా కౌన్సిల్ జరిగే సమయంలో పలువురు కార్పొరేటర్లు మాట్లాడే విషయాలను చాలా గ్రహించానని, అందులో గాడు చిన్ని లక్ష్మి కుమారి, మూర్తి యాదవ్, వసంత లక్ష్మి, బాణాల శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సతీష్, గంకల కవిత, డిప్యూటీ మేయర్ గోవిందరాజు ,పల్లా శ్రీనివాసరావు, పులి లక్ష్మి భాయ్, గంధం శ్రీనివాసరావు,లేళ్ళ కోటేశ్వరరావు, బొండా జగన్నాథం, రాపర్తి కన్నా, పిసిని వరాహ నరసింహ, బిపిన్ జైన్, స్టాలిన్, గంగారాం, నీలి బాబు, అనూష ఇలా చాలామంది వారు మాట్లాడే తీరు, వార్డు అభివృద్ధి పట్ల వారికున్న చిత్తశుద్ధి స్వయంగా చూశానన్నారు. ఎప్పుడైనా, ఎవరికైనా వార్డు పనుల మంజూరులో ఆలస్యం జరిగినా అందరూ పెద్ద మనసుతో మన్నించాలని కమిషనర్ తెలిపారు. జీవీఎంసీ కౌన్సిల్ కాలంలో కార్పొరేటర్లు, మేయర్లు జీవీఎంసీ యంత్రాంగానికి అందించిన సహకారానికి ప్రత్యేక ధన్యవాదాలు కమిషనర్ తెలిపారు. అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనర్లు డివి రమణ మూర్తి, పీఎం సత్యవేణి, ఎస్ఎస్ వర్మ, పి నల్లనయ్య, కార్యదర్శి బివి రమణ మాట్లాడుతూ ఈ కౌన్సిల్ కాలంలో కార్పొరేటర్ల నుండి ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకోగలిగామని వాటిని పరిష్కరించే అవకాశం లభించినందుకు ఆనందంగా ఉందని ఈ కౌన్సిల్ ఎప్పుడు చరిత్రలో అందరికీ గుర్తుండేలా మిగిలి పోతుందని పేర్కొన్నారు.

అనంతరం నగర మేయర్‌కు, డిప్యూటీ మేయర్‌లకు, ఫ్లోర్ లీడర్లకు, కార్పొరేటర్లకు, గాజువాక శాసన సభ్యులు, జీవీఎంసీ కమిషనర్, జిఎంసి అధికారులు సత్కరించి జ్ఞాపకం పంపించి అభినందనలు తెలిపారు. అనంతరం జీవీ ఎంసీ కమిషనర్‌ను గాజువాక శాసనసభ్యులు, మేయర్, డిప్యూటీ మేయర్లు కార్పొరేటర్లు దుస్సాలుతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వారి కుటుంబ సభ్యులు, జీవీఎంసీ అధికారులు, ఇంజనీర్లు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుడి జీవితాల్లో "గ్యాస్" మంటలు

## - సిలిండర్లు కొరత లేదన్న అధికారుల మాటలు








**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గృహ అవసరాలకు వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల సరఫరా విషయంలో ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, సిలిండర్ల కొరత లేదని గ్యాస్ యధాతదంగా సరఫరా అవుతుందని జిల్లా అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. గ్యాస్ సిలిండర్ అస్సలు బుకింగ్ అవడం లేదని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. గ్యాస్ బుకింగ్ కోసం మొబైల్ ఫోన్లో ప్రయత్నం చేస్తే చాలా గంటల పాటు బిజీ వస్తుందని వినియోగదారులు వాపోతున్నారు. తమకు వచ్చిన సమస్య ఎవరికి చెప్పుకోవాలో, ఎవరిని అడగాలో తెలియక వినియోగదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ వినియోగదారులు గ్యాస్ బుకింగ్ కోసం తమ సెల్ ఫోన్ ద్వారా ప్రయత్నిస్తే బుకింగ్ కాల్ దొరకడం లేదని కొందరు, కాల్ కట్ అయిపోతుందని కొందరు వినియోగదారులు అంటున్నారు. కొందరికి బుకింగ్ నెంబర్ దొరికి గ్యాస్ బుక్ అయినా ఓటిపి రావడంలేదని వాపోతున్నారు. మరికొందరికి కొద్దిసేపు ఆగి మళ్లీ ప్రయత్నం చేయండి అంటూ వాయిస్ మెసేజ్‌లు వస్తున్నాయి. తర్వాత ఎంత ప్రయత్నించిన ఉపయోగం లేకపోవడంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ బుక్ కాకపోతే తమ పరిస్థితి ఏమిటంటూ తమ బాధని వ్యక్తం చేస్తున్నారు. సర్వర్లలో చిన్న చిన్న సాంకేతిక సమస్యల వల్ల బుకింగ్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్యాస్ ఏజెన్సీలో చెబుతున్నాయి. సాంకేతిక సమస్యలను అధిగమించి వినియోగదారులకు ఇబ్బంది లేకుండా గ్యాస్ సరఫరా జరిగే విధంగా చూస్తామని ఏజెన్సీలు అంటున్నాయి. గ్యాస్ బుక్ చేసిన ఐదు రోజుల్లోనే గ్యాస్ సరఫరా జరుగుతుందని జిల్లా పౌర సరఫరాల అధికారి మురళీనాథ్ చెప్పారు. కానీ గ్యాస్ బుక్ చేసి వారం రోజులు అయినా గ్యాస్ రావడం లేదని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు గ్యాస్ ఏజెన్సీలతో మాట్లాడి సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ జరిపి వినియోగదారుల గ్యాస్ కష్టాలను తీర్చవలసిన అవసరం, బాధ్యత ఎంతైనా ఉంది.

# వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం





**ఆలమూరు, (రాజధాని వార్తలు):** ఆలమూరు మండలంలోని నర్శిపూడి గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆలమూరు వారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆలమూరు మండలం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎల్ అనిత అధ్యక్షతన ఈ పశు వైద్య శిబిరాన్ని ఆలమూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొత్తపల్లి వెంకటలక్ష్మి దుర్గారావు, అధ్వర్యంలో మాజీ ఏఎంసీ చైర్మన్ దునే స్వామి నాయుడు, సొసైటీ అధ్యక్షులు రాయుడు వెంకటస్వామి (బాబ్జి), జనసేన నాయకులు వుండమట్ల బాలాజీ, కొత్తపల్లి నగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో రెండు పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసుకునేందుకు కూటమి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందని మొదటి గా నర్శిపూడి గ్రామంలో ఏర్పాటు చేసామని, రెండోది రేపు పినపళ్ళ గ్రామంలో ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ పశువైద్య శిబిరంలో డాక్టర్లు జి భాను ప్రకాష్, బి సుభాష్ చంద్ర సమక్షంలో 85 మంది పశు పోషకులు తీసుకువచ్చిన 151 పశువులకు వైద్య సేవలను అందజేసారు. వాటిలో 70 పశువులకు ఆరోగ్య గర్బకోశ పరీక్షలు నిర్వహించగా మిగిలిన 81పశువులకు నట్టల నివారణ నిర్వహించి పశు ఆరోగ్య నిమిత్తం మెరుగైన పోషక విలువలు కలిగిన మినరల్ మిక్చర్ ప్యాకెట్లును, ప్రతి ఒక్క పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి వి పైడేశ్వరావు పశు వైద్య శాఖా,మార్కెట్ కమిటీ సిబ్బంది, పాడి రైతులు, గ్రామస్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆస్తి పన్ను చెల్లించి 50 శాతం వడ్డీపై రాయితీని పొందండి

## - ఈ సదవకాశాన్ని ఆస్తిపన్నుదారులు మార్చి 31 లోగా వినియోగించుకోండి : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని గృహ యజమానులకు/ ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ముఖ్య విజ్ఞప్తి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆస్తి పన్ను చెల్లింపు పై 50 శాతం వడ్డీ మాఫీ చేస్తూ జి.ఓ.యం.యస్. నెం. 58 ఎం.ఏ.&యు.డి. (సి2) డిపార్టుమెంటు, తేది. 16-03-2026న ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ సదవకాశాన్ని ఆస్తిపన్నుదారులు మార్చి 31లోగా వినియోగించుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి, జి.వి.యం.సి.కి చెల్లించవలసిన ఇంటి పన్నులు, ఖాళీ జాగా పన్నుల బకాయిలు మరియు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అనగా 2025-26 సంవత్సరంనకు చెల్లించవలసిన పన్నులు తేది 31.03.2026 లోగా ఏక మొత్తముగా ఒకేసారి చెల్లించిన యెడల వాటిపై విధించబడిన వడ్డీనందు 50 శాతం మినహా యింపును పొందవచ్చునన్నారు. కావున, విశాఖ నగర పరిధిలోని గృహ యజమానులు/ ఆస్తిపన్ను చెల్లింపుదారులు ప్రభుత్వం కల్పించిన ఈ సదవకాశం వినియోగించుకొని జి.వి.యం.సి.కి చెల్లించవలసిన ఇంటి పన్నులు, ఖాళీ జాగా పన్నుల బకాయిలు వెంటనే చెల్లించి, 50 శాతం వడ్డీ రాయితీని పొందవలసినదిగా కోరడమైనదని జీవీఎంసీ కమిషనర్ తెలియజేశారు. ఈ సదావకాశం తేది 31.03.2026 వరకు మాత్రమేనని తెలియజేశారు. నగర ప్రజలు సౌకర్యార్థం, ప్రతీ వార్డు సచివాలయ పరిధిలోని ప్రతీ గృహ ఇంటి యజమానిని వారి గృహము వద్దనే వార్డు సచివాలయ కార్యదర్శి వచ్చినప్పుడు / సంప్రదించినప్పుడు వారి యొక్క ఆస్తి పన్ను బకాయిలను డెబిట్ / క్రెడిట్ కార్డ్ లేదా యు.పి.ఐ. ద్వారా గాని చెల్లింపులు జరుపవచ్చునన్నారు. మరియు ఈ దిగువ బ్యాంకులు మరియు జి.వి.యం.సి ప్రధాన కార్యాలయం అలాగే అన్ని జోనల్ కార్యాలయాల్లో సౌకర్యం కేంద్రముల వద్ద ఆస్తిపన్ను చెల్లింపుదారులు తమ పన్ను బకాయిలను పని వేళల్లో చెల్లించవచ్చునని తెలిపారు. ఐడిబిఐ-సిరిపురం బ్యాంక్ బ్రాంచ్ - ఐ.సి.ఐ.సి.ఐ.-ద్వారకానగర్ బ్రాంచ్, పంజాబ్ నేషనల్ బ్యాంకు-మధురవాడ బ్రాంచ్ యాక్సిస్ బ్యాంకు-రామ్ నగర్ బ్రాంచ్ పనివేళలో అలాగే జి.వి.యంసి. ప్రధాన కార్యాలయము, అన్ని జోనల్ కార్యాలయములలో గల సౌకర్యం కేంద్రములు. ఆదివారం, సాధారణ సెలవు దినములలో కూడా ఉదయం గం.8.00 ల నుండి సాయంత్రం గం.8.00 ల వరకు తేది 31.03.2026 వరకు పనిచేయబడునన్నారు. కావున నగరములోని గృహ / ఇంటి యజమానులు జి.వి.యం.సి.కి చెల్లించవలసిన ఇంటి పన్నులు, ఖాళీ జాగా పన్ను చెల్లింపుదారులు ఈ సదావకాశమును వినియోగించుకొని తేది 31.03.2026 లోగా చెల్లించి వడ్డీ రాయితీని పొంది నగర అభివృద్ధిలో కార్పొరేషన్‌కు చేయూతనందించవలసినదిగా జీవీఎంసీ కమిషనర్ తెలియజేశారు.

# యాదవ కార్పొరేషన్‌కు రూ.5,000 కోట్లు కేటాయించాలి

## - యాదవ హక్కుల పోరాట సమితి డిమాండ్





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని రాదే గెస్ట్ ఇన్ నందు బొమ్మి నాగ కిశోర్ యాదవ్ అధ్యక్షతన యాదవ కార్పొరేషన్‌కు ప్రభుత్వం వెంటనే రూ.5,000 కోట్ల నిధులు కేటాయించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని యాదవ హక్కుల పోరాట సమితి హెచ్చరించింది. మంగళవారం నెల్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాదవ్ హక్కుల పోరాట సమితి ప్రతినిధులు తమ డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. నిధులు లేక నిర్వీర్యమైన యాదవ కార్పొరేషన్‌కు తక్షణమే రూ.5,000 కోట్లు కేటాయించాలి. ఆంధ్రప్రదేశ్ రాజధానిలో యాదవుల కోసం ప్రత్యేకంగా భవనాన్ని నిర్మించాలి. వసతులు లేక ఇబ్బంది పడుతున్న బీసీ మరియు యాదవ విద్యార్థులకు మెరుగైన విద్యా, వసతి సౌకర్యాలు కల్పించాలి. మార్కాపురం జిల్లాను కాటమరాజు జిల్లాగా నామకరణ చేయాలి. రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలి.

**15 రోజుల గడువు - ఆమరణ దీక్ష హెచ్చరిక: మేకల రాములు యాదవ్**

తెలంగాణలో పోరాటాల ద్వారా యాదవ కార్పొరేషన్‌ను, యాదవ భవనాన్ని సాధించుకున్నామని, అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోనూ తమ హక్కుల కోసం పోరాడుతామని ఈ సందర్భంగా వారు తెలిపారు. యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్ నాయకత్వంలో ఈ డిమాండ్లను ప్రభుత్వానికి పంపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం 15 రోజుల్లోగా సానుకూల నిర్ణయం తీసుకోకపోతే, రాములు యాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆమరణ నిరాహార దీక్షలకు దిగుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో యాదవ ట్రస్ట్ చైర్మన్ బొమ్మి నాగకిషోర్ యాదవ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సమాజ శ్రీనివాస్ యాదవ్, రావుల పల్లి వెంకట జ్యోతి యాదవ్ చెవుకుల జనార్ధన్ యాదవ్ ఉడుత మురళి యాదవ్, మనోజ్ కుమార్ మరియు ఇతర యాదవ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ అయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞాననందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మీ సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారుల పనితీరు ప్రశంసనీయం

## - ఏపీఎంపీఏ రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్ అభినందనలు



**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఎన్టీఆర్ జిల్లాలో జర్నలిస్టులందరికీ మీడియా అక్రిడిటేషన్స్ అందించడంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారుల పనితీరు ప్రశంసనీయమని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఏపీఎంపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలోని గవర్నర్‌పేట ప్రాంతంలో ఉన్న జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో సీనియర్ జర్నలిస్ట్, ఎన్టీఆర్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు యేమినేని వెంకటరమణ ఆధ్వర్యంలో విజయవాడ నగర అధ్యక్షుడు తాళ్లూరు అనిల్ కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. అనంతరం ఈ సందర్భంగా ఏపీఎంపీఏ రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి చైతన్య, విజయవాడ నగర ఉపాధ్యక్షుడు వేల్పుల ప్రశాంత్, కోట రాజా తదితరులు జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులను కలిసి దుశాలువాతో సన్మానించారు. జర్నలిస్టుల పట్ల అధికారులు చూపిన సానుకూల దృక్పథం, పారదర్శక విధానాన్ని ప్రశంసిస్తూ సంఘం నాయకులు తమ కృతజ్ఞతలు తెలిపారు. వీర్ల శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ, జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు అందజేయడం అనేది కేవలం పరిపాలనా ప్రక్రియ మాత్రమే కాకుండా, మీడియా రంగానికి ప్రభుత్వ గుర్తింపు, ప్రోత్సాహం అన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఈ ప్రక్రియను వేగవంతంగా, నిష్పక్షపాతంగా అమలు చేయడంలో జిల్లా కలెక్టర్ లక్ష్మిషా పర్యవేక్షణలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులు కీలక పాత్ర పోషించారని ఆయన ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా డిపిఆర్ఓ రమణ, డివిజనల్ పి.ఆర్.ఓ. రవి మరియు ప్రసాద్ తదితర అధికారులు జర్నలిస్టులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, ప్రతి అంశాన్ని సమగ్రంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి వర్కింగ్ జర్నలిస్ట్ కు అక్రిడిటేషన్ అందేలా చర్యలు తీసుకోవడం అభినందనీయం కమిటీ సభ్యు యేమినేని వెంకట రమణ పేర్కొన్నారు. అలాగే జర్నలిస్టులు సమాజానికి అద్దం పట్టే వర్గమని, వారి పనితీరుకు సరైన గుర్తింపు లభించడం అవసరమని ఆయన అన్నారు. అక్రిడిటేషన్ కార్డుల ద్వారా జర్నలిస్టులకు అధికారిక గుర్తింపు లభించడంతో పాటు వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం కలుగుతుందని, సమాచార సేకరణలో సౌలభ్యం పెరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులు మాట్లాడుతూ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మిషా మార్గదర్శకత్వంలో ఈ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు జర్నలిస్టు సంఘాల సభ్యులతో పలుమార్లు చర్చలు జరిపి, అర్హత ప్రమాణాలను స్పష్టంగా నిర్ధారించి, ప్రతి అర్హుడైన జర్నలిస్టుకి అక్రిడిటేషన్ అందేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో పారదర్శకతను పాటించడం, ఎటువంటి వివక్ష లేకుండా వ్యవహరించడం తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. అదేవిధంగా భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో, వారి వృత్తి అభివృద్ధికి సహకరించడంలో జిల్లా పౌర సంబంధాల శాఖ ఎల్లప్పుడూ ముందుండుతుందని అధికారులు హామీ ఇచ్చారు. జర్నలిస్టులు మరియు ప్రభుత్వ యంత్రాంగం మధ్య పరస్పర అవగాహన, సహకారం పెరిగితే సమాజానికి మరింత నాణ్యమైన సమాచారాన్ని అందించగలమని వారు అభిప్రాయపడ్డారు. మొత్తంగా, ఎన్టీఆర్ జిల్లాలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా ప్రభుత్వం, అధికారులు మరియు మీడియా వర్గాల మధ్య మంచి అనుబంధం నెలకొన్నదని ఈ కార్యక్రమం స్పష్టం చేసింది. ఇది భవిష్యత్తులో కూడా మీడియా-ప్రభుత్వ సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగుగా భావించవచ్చు.

# న్యాయం అడిగిన మహిళలపై దాడులు.. డ్రగ్స్ ఎంపీలకు రక్షణ - ఇదేనా కూటమి పాలన : జగ్గిరెడ్డి ఆగ్రహం






**ఆలమూరు, (రాజధాని వార్తలు):** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కూటమి ప్రభుత్వ విధానాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో విరుచుకు పడింది. తిరుపతి పుణ్యక్షేత్రంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు రాజీనామా చేయాలంటూ శాంతియుతంగా నిరసన చేపట్టిన మహిళా నాయకులపై పోలీసులు దాడులు చేసి, తప్పుడు కేసులు పెట్టి అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి అవమానకరమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి తీవ్రంగా మండిపడ్డారు.

అమలాపురం సమీపంలోని ఈదరపల్లి బ్రిడ్జ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ఘాటైన విమర్శలు గుప్పించారు. తిరుమల తిరుపతి వంటి పవిత్రక్షేత్ర గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వివాదాస్పద వ్యవహారాల్లో చిక్కుకోవడం అత్యంత సిగ్గుచేటు అని జగ్గిరెడ్డి విమర్శించారు. మహిళలు శాంతియుతంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినా వారిపై పోలీసులతో దాడులు చేయించడం, తప్పుడు కేసులు నమోదు చేయించడం కూటమి ప్రభుత్వ దుర్మార్గ పాలనకు స్పష్టమైన ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. వెంటనే బీఆర్ నాయుడును పదవి నుంచి తప్పించాలని, లేకపోతే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇక మరోవైపు హైదరాబాద్ సమీపంలోని మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో ఇటీవల జరిగిన పోలీసుల దాడిలో ఎలూరు ఎంపీ పుట్ట మహేష్ కుమార్ యాదవ్ డ్రగ్స్ వాడినట్టు పరీక్షల్లో తేలిన ఘటనను కూడా జగ్గిరెడ్డి తీవ్రంగా ప్రస్తావించారు. డ్రగ్స్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీలను కాపాడుతూ, మరోవైపు మహిళలపై దాడులు చేయడం కూటమి ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. అధికారంలో ఉన్నవారి తప్పులను కప్పిపుచ్చేందుకు ప్రభుత్వం యత్నిస్తున్నా ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఇటు వంటి చర్యలు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకతను మరింత పెంచుతున్నాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్, తోట త్రిమూర్తులు, మాజీ ఎంపీ చింతా అనురాధ, పరిశీలకులు జక్కంపూడి విజయలక్ష్మీజాతీయ అవార్డు గ్రహీత,ప్రముఖ పారిశ్రామిక వేత్త డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు, కో-ఆర్డినేటర్లు పినిపే శ్రీకాంత్, పిల్లి సూర్యప్రకాశ్, గన్నవరపు శ్రీనివాస్, పాముల రాజేశ్వరిదేవి, తమ్మన్న శ్రీను, నామాల శ్రీను,వనుము సూరిబాబు, తోరాటి రాంబాబు, తోరాతి గోవింద్, వేత్స శ్రీను, ఎలుగుబంట్ల బూరయ్య, ఎరుకొండ గణేష్, మార్గాని వీరబాబు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై వారు తీవ్రంగా స్పందిస్తూ కూటమి పాలనపై నిప్పులు చెరిగారు.

# ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాలి




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ఆర్టీఓ కార్యాలయంలో పెద్దాపురం మండలానికి సంబంధించి, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గల సిబ్బందికి రబీ సీజన్ ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు మరియు ట్రైనింగ్ శిక్షణా కార్యక్రమం మంగళవారం ఏఓ సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేపట్టాలని, నాణ్యత ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఏట సూచించారు. ఈ కార్యక్రమంలో సి.ఎస్.డి.టి.భారతి, సివిల్ సప్లైస్ సిబ్బంది, వీఏఏలు, వీహెచ్ఎలు, వీఆర్వోలు, ధాన్యం కొనుగోలు సిబ్బంది పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan